# THE BOOK WAS DRENCHED

UNIVERSAL LIBRARY

OU_204666

UNIVERSAL LIBRARY

OUP—2273—19-11-79—10,000 Copies

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. Accession No.

Author

Title

This book should be returned on or before the date last marked below.

21 JAN 1987

OCT 2001

14 A 1993

శ్రీ

# రామకృష్ణ-వివేకానంద


కర్త:

దేశపాండ్యా, విన్నకోట వేంకటరత్నశర్మ



ప్రచురణ:

గీతా ప్రచురణాలయము

దుర్గా అగ్రహారము


బెజవా

## —: ఈ నాటకము నందు వచ్చు పాత్రలు :—


1. గదాధరుడు - శ్రీరామకృష్ణ పరమహంస
2. నరేంద్రుడు - వివేకానందస్వామి
3. శారదాదేవి

Checked 1963

4. హృదయుడు (రామకృష్ణుని శిష్యుడు)
5. సురేశ్ (నరేంద్రుని మిత్రుడు)
6. దేవేంద్రనాథఠాకూరు (బ్రహ్మసమాజ మతగురువు)
7. ఇరువురు బ్రాహ్మణులు
8. ఇరువురు పౌరాణికులు
9. ఇరువురు దొంగస్వాములవాళ్లు
10. ఇరువురు శిష్యురాండ్రు - సుబ్బమ్మ, నూరమ్మ
11. చికాగో సభలో దొరలు, దొరసానులు
12. ఒక క్రైస్తవబోధకుడు
13. ఒక మహమ్మదీయసోదరుడు
14. కాళికాదేవి



శ్రీ వివేకానందస్వామి



శ్రీరామకృష్ణపరమహంస



దేశపాండ్యా విన్నకోట వెంకటరత్నశర్మ

Lecturer on :

| | |
|---|---|
| Ramakrishna Paramahamsa | Ramayanam |
| Vivekananda Swami | Bharatam |
| Chaitanya Prabhu | Bhagavatam |
| Sri Ramatirtha Swami | Upanishads |
| Potanna | Brahmasutras |
| Tyagayya | Bhagavadgita-Bible-Koran |

# పీఠిక

నాటకరంగము పవిత్రమైనదనియు, కవి నటకులు కలసి, సంఘము నెప్పటికప్పుడు సంస్కరించుచుందురనియు మన మంగీకరించినప్పుడు, సంఘసంస్కరణమునకు పూనుకొను వారును, సామగ్రియు, ఎట్లుండవలయునో యోచింతము.

ముందు కాలప్రవాహమును గమనింపవలయును. సంస్కరణ మనగా కాలప్రవాహమును తోడుకొనుటయే యగును. ఆచార్యపురుషులందఱు ప్రవాహ మెఱిఁగినవారై, అట్లు మెలఁగిన వారే యైరి.

నాటకమున కథాసారము అనుకరణము యుపన్యాసము లుండును. ఆ యా పాత్రలు సందర్భానుసారముగా రసపోషణకై పలుకు పలుకులే యుపన్యాసములు. అవి గద్యము గాని పద్యము గాని, పాటగాని. కేవల కథాదృష్టియే గలవారలో, నూటికిలో ఇర్వురకే రుచించును. - నాటకరచనగాని, నటనాచాతుర్యము గానీ - అందువలన వ్యక్తికిగాని సంఘమునకుగాని ఆర్థికముగా దెబ్బతగులును. కేవల ఆర్థికదృష్టికి, మనమతములో తావు లేదు. కావున నిటు నటు నుండు నాటకము ఎక్కువ వ్యాప్తిలోనికి వచ్చును. కేవలము నటుల ప్రవర్తనలు చక్కగా లేవని, అందువలన సంఘములో నాటకముల విలువ తగ్గిపోవుచున్న దనువారు కలరు. అక్కడ గమనింపవలసినది "కథాదృష్టి" గాని, "ఋషిదృష్టి"గా దందురు కొందఱు. "ఆఋషిదృష్టి"తో చూచినచో, ఆధ్యాత్మిక ప్రచారకులుగాని రాజకీయ ప్రచారకులుగాని, సంఘసంస్కరణోద్యమప్రచారకులుగాని, ఎంతమంది పరీక్ష కాగగలరు!

ఈ నాటకమునందు, దరిద్రులగు, స్వాములు ధనము నిమిత్తమును, ధనమున్న స్వాములు స్థానమానపూజల కోసమును, శిష్యులను, శిష్యురాండ్రను చేర్చుకొని, వారి నెత్తిపై చేయినెట్టి, కొంపలు తీయుట చూపింపబడినది. శ్రీరామకృష్ణుని జీవితము ద్వారా, వాస్తవమగు భక్తి యెట్లుండునో చూపబడినది. వివేకానందస్వామి పాత్ర ద్వారా, దేశభక్తి మతముయొక్క సారస్వము తెలుపబడినది. శారదాదేవి సౌశీల్యపాతివ్రత్యముల ద్వారా, స్త్రీలయొక్క యుత్తేజము తెలుపబడినది.

అన్నిటికంటె ముఖ్యముగ "సర్వమతసామరస్య తత్వము" భగవద్గీతలో శ్రీకృష్ణభగవానునిచే చెప్పబడినది. ఆవిషయమే శ్రీరామకృష్ణుడు నిరూపించెను. వివేకానందుడు లోకమునకందించెను. కానినే నివర్ణ్యజ్ఞానసమాజము లోక ప్రఖ్య, శ్రీరామకృష్ణమఠము లోకప్రఖ్య, తీవ్రమగు కృషి చేయుచున్నవి గాని చిన్న రంగములో ఈ గ్రంథకర్త చెప్పినట్లు, స్వార్థపరుల గాంగానే, అవి లోకోపకారము భగ్నమగుచుండును. భాషాజ్ఞానము లేని నటులును, కొంచెము కష్టించినచో, కవి భాషను, భావమునను, ఎంతేని యన్న తేగలరు. ఒక్కొక్కప్పుడు, పద్యము చదువుచున్నను, ఆరితేరిన నటకుని నోటిలో పడితేనే శోభనిచ్చును. గావున రక్తికొరకు విధము చెప్పుటకు వీలులేక మానసిక నాట్యములేక కవి గాధలను. బాహ్యనటనలేని నటుడు గాధలను ఈ నాటకము ముందెట్లు నడచునో చూడవలసియున్నది.

# శ్రీరామకృష్ణ - వివేకానంద

## రంగము 1

(నరేంద్రుడు Dress చేసికొనుచుండును - సేవకులు పరికరము లందిచ్చుచుందురు).

సురేంద్రుడు:- (ప్రవేశించి) ఓహో! ఏమి యీ నరేంద్రుని దర్జా!

సీ. నెలకు వేలకు వేలు నిలువఁజేసెడు తండ్రి
కావలసిన విచ్చు కన్నతల్లి
పిలుచుట తడవుగా వెడలును తనతండ్రి
వెంట టీపార్టీల విందులకును,
కాలుక్రిందఁబెట్టఁ డొక్క నిమేషమైన, సం
చారముల్ మోటారుకారులందె,
మృష్టాన్నభోజనంబే గాక, ఫలహార
ములు, రకరకములు తలచినంత
గీ. పట్టు సందిచ్చుట కొఱకు, పట్టు నేసఁ
కొనుగుట కొఱకు కాలబూట్ తొడుగ నొకఁడు
భోగభాగ్యాల నిట్టు, తుల తూగుచున్న
పెట్టి పుట్టుటయే సాక్షి పృథివిలోన.

అన్నము లేమి ఆకలిమంటచేతను, వస్త్రము లేమి చలిచేతను, ఉద్యోగములేమి దరిద్రముచేతను బాధపడు పేద వారల కష్టము లెట్టి ధనవంతుల కేమెఱుక!

నరేం—మిత్రమా ! నేను వినుచునే యున్నాను. ఏమంటివి ?
"పేదవారల కష్టము లిట్టి ధనవంతుల కేమెఱుక" యనియా?
ఈ వాక్యములు మా కుటుంబముపట్ల చెల్లునా ?

సీ. నెలకు వేలు గడింప నేర్చెను మాతండ్రి,
నిలువఁజేయుటకు దా నేర్చినాఁడ ?
ఏవేళ నెచ్చోట నే పేద విద్యార్థు
లడిగినఁ ధనము లేదనుట గలదె ?
వస్త్రవిహీను లెవ్వరుగాని కనుపింప
పై వస్త్ర మర్పించు భాగ్యశాలి
'అన్నమో రామచంద్రా' యను నన్నార్తు
లగుపింప, ననుకంప నరయురాఁడె ?
గీ. ఇంత చెప్పంగ నేటికోయీ, వయస్య!
విశ్వనాథుని ధనముంగూర్చి యెరుగ నట్టి
సంస్థ యేదేనిఁ గలదె ? మెచ్చుటను వినవె ?
దత్తుల కుటుంబఖ్యాతి కలకత్తలోన !

సురేం—నీ వేమందువో యని యంటినిగాని, మీ కుటుంబ
ప్రఖ్యాతి మా నాయనగారు చెప్పఁగా నెన్నియోసార్లు
వింటిని. సరే, టెన్నిస్ ఆటకు వేళ యగుట లేదా ?
(ముందునకు వత్తురు - తెరపడును)

నరేం—బ్యాట్ ! - (నౌకరు తెచ్చి యిచ్చును.) సురేశ్ ! దీని
ఖరీదు 250 రూపాయలు !

సురేం—ఆ ధనముతో పేదకుటుంబము ఒక సంవత్సరము
నిశ్చింతగా జీవించును.

నరేం—నీవు విశాల దృష్టి నుపయోగించుటలేదు. దీని ఖరీదు 250. ఈ ధనము ఎందరు కార్మికులు పంచుకొందురో తెలియునా? - ఇప్పుడు కోర్టునుండి బ్రాహ్మమందిరమునకు పోవుదము. నీవును వచ్చెదవా?

సురేం—చిన్నప్పుడు సీతారామవిగ్రహపూజలు, పార్వతీ పరమేశ్వర ధ్యానములు చేయువాడవట. ఇప్పుడు నిరాకారోపాసనాపద్ధతిలో చేరితివి. ఇంకముందెందుఁ జొరఁబడుదువో, ఎట్లుందువో? ఎట్లుండుటకేమి? ఏఁబది వేలరూపాయల కట్నముతో రాఁగల ఒక బంగారువంటి పిల్లతో, మోటారు కారు నెక్కి కలకత్తా వీధులలో తిరుగుదువు. మావంటి మిత్రులకు టీపార్టీ ఎప్పుడో !

నరేం—ఈ వాసన నీ దగ్గఱకుకూడ వచ్చెనా? నా మనస్సా పైపునకే పోవుట లేదోయీ-

గీ. పెండ్లివార్తలటన్నను పెండ్లికట్న
ముల విశేషమ్ము లన్నను గలుగు మోజు
యువకులకు; నాకదేమి మోజుండదోయి,
ఏమికారణమో వచియింపజాల !

సురేం—మఱి నీచిత్తమెందు ప్రసరించుచుండును?

నరేం—ఏయే మతములు గలవో ఆయా మతములం దెలియఁజేయు గ్రంథము లెన్ని గలవో, ఆ యా మతములం బెద్దలేయే యాచారము లుత్కృష్ట మొనర్చిరో, యేవి జీవి నే దారికి గొనిపోవునో యను జిజ్ఞాసలో రాత్రింబవళ్లేమో

చదువుచుందును. మనసు జ్ఞానపుస్తకములకై పోవనే
పోవదు - ఐనను బడిచదువు వలన నేమిలాభము?

సీ. వినయవివేకాది వివిధలక్షణములు
సంభవించునె బడిచదువుచేత
పాపభీతియు దైవభక్తియున్ శీలంబు
సంప్రాప్తములె బడిచదువుచేత
ఇటునటుఁ ద్రిప్పించు నింద్రియ భోగంబుల
నమణింతునా బడిచదువువలన
అజ్ఞాన విధ్వంసమగునా? ఘటిల్లునా?
జ్ఞానోదయము బడిచదువువలన

గీ. జీవితమ్మున కేది ప్రశస్తమగు నట్టి
సత్యమలవడునా? బడిచదువువలన
పుణ్యమా? పురుషార్థమా? పోని చిత్త
శాంతియా? మైత్రియా! బడిచదువుచేత?

నరేం.—ఐనను ఎప్పటి కప్పుడు ప్రతిక్లాసునుండియు, ప్రథమ
తరగతిలోనే యుత్తీర్ణుఁడ వగుచుందువు.

గీ. నీ ముఖంబును కన్నులు నీ విశాల
వక్షమును గళమును తీవి వన్నెలొల్కు.
పల్కులును దర్ప నడకలు వర్తనంబు
గాంచ మొందెంత ఘనుఁడవు గాఁగలాడ
వో యటంచు నా మనసునం దూహ వొడము!

నరేం.—అది యెట్లు సను నూఁడసి! ప్రస్తుతము జెన్నిను
కోర్టునకై పుస్తకము మనదృష్టి ప్రసరింపజేతము. నమస్తే.
(నిష్క్రమింతురు)

## రంగము 2

### కాళికాలయము - కాళీవిగ్రహము.

(కంఠమున కపాలమాలిక, నడుముచుట్టు బంగారు హస్తములు, క్రిందుగా నున్న ఎడమ చేతిలో ఒక బంగారుతల, కుడిచేయి అభయ ప్రదానము చేయుచుండుట; ఒక చేతిలో కత్తి, కాసెకోక ఆపాద మస్తకం ఆభరణాలు.)

గదాధరుడు సాష్టాంగవందన మాచరించును.

హృదయుడు—(ప్రవేశించి స్వగతము.)

ఆ. వె. ఆ ప్రదేశ మడవి, అర్ధరాత్రి సమయ
మట దిగంబరుండునై జపించు
నితడు; చిత్రమయ్యె నిట్లొనర్పంగ నేమొ
దీని కారణంబు తెలియవలయు.

(ప్ర) ఆర్యా! వందనములు.

ఆ. వె. ఆ ప్రదేశ మడవి అర్ధరాత్రి సమయ
మట దిగంబరుండుగా జపింతు
రేల చిత్రమయ్యె నిట్లొనర్పంగ హేతు
వేమొ! తెలియఁ జేతురే మహాత్మ!

గదా—హృదయా! నీవు నావెంటనే వచ్చి చూచితివా?

హృద—రెండునాళ్ళుగా వచ్చుటకు భయపడితినిగాని, నిన్న రాత్రి సాహసించి వచ్చి చూచితిని. మీ ధ్యానవిధానము చూడ నా కాశ్చర్యభయము లొక్కసారిగనే అంకురించెను. ఆ విషయము తెలిసికొనుటకే ప్రశ్నించితిని.

గదా—అబ్బాయీ! బాల్యమునుండియు మన మెనిమిది కట్టు

త్రాళ్లచే బంధింపబడితిమి. అసూయ, అవమానము, గౌర
వము, విద్య, భయము, అభిమానము, కులము, కీర్తి,
యజ్ఞోపవీతము. యజ్ఞోపవీతము నేను బ్రాహ్మణకులమునకు
చెందినవాడనని చెప్పును. తన నామే తక్కినవారికంటె నే
నెక్కుడను అభిమానమును కల్పించును. ఆ కులాహంకార
మును దూరముగా నుంచుటకై యజ్ఞోపవీతమును దూర
ముగా నుంచుదును. ఇంక వస్త్రమా, మధ్యవచ్చినదేగాని
మొదటరాలేదు. చివర కుండదు. కావున దీనిని తీసివేసితిని.
ధ్యానమైన వెంటనే మరల ధరించి వచ్చుచుందును. కాళీ
మాతను ధ్యానించు నప్పుడును ఆ యహంకార ముండవల
యునా? కాళీమాత కులముల హెచ్చుతక్కువలు
చూడదు. హృదయా! దేవాలయము లోనికి వచ్చి యుండిన
సాధువుల కేమి గావలయునో నీవుపోయి జాగ్రత్తపెట్టుము.

హృద— మీ అమ్మగారు మీ పెండ్లిగూర్చి ఆలోచించు
చున్నారట.

గదా—(స్వ) చావు బ్రతుకులమధ్య నే నున్న విషయము
అమ్మ కేమి తెలియును? (ప్ర) ఆ విషయమున కేమిగాని
పొమ్ము.

హృద—(నిష్క్రమించును.)

గదా—అమ్మా! ఎట్లో నీ సేవచేయుట కీశరీర మేర్పడి నందు
లకు నీకు ధన్యవాదము లర్పించుచున్నాను. ఎన్ని కళే
బరములు వ్యర్థములై నశించుటలేదు!! ఈ కళేబర మేనాడో
కొంచెము సుకృతము చేసియుండుటచేతనే, నీ సాన్నిధ్య

మున నుండుట కవకాశ మేర్పడినది. కాని అంతలో నేమి తృప్తిమైనది. ఇల్లలికిన యంత పండువాయెనా? అమ్మా! నీవు దర్శనమీయవా? నాపై నీ కటాక్షమురాదా? రామప్రసాదు మొదలైన మహాభక్తులకు నీ దర్శనభాగ్య మబ్బెనటగద? నీవేల నన్నుద్ధరింపవు? నేనంత అధమా ధముడనా? అగుగాక - పాపులపై నగద నీవు ప్రేమ ప్రస రింప వలయు? ఇక్కడ నింద్రియ విషయానందముగాని, ధనముగాని, మిత్రులుగాని, సుఖములుగాని నాకక్కఱ లేదమ్మా! వీరందఱును మృత్యుబాధ తప్పింపగలరా?

(అక్కడ నుంచఁబడిన తట్టలోచూచి)

ధనమా! నా కక్కఱలేదమ్మా!- వస్తుసముదాయమా! నా కక్కఱలేదమ్మా - బిరుదులా! ఛూ! నా కక్కఱలేదమ్మా- రంభలవంటి రమణీమణులా! వలదమ్మా - ఆ కీలుబొమ్మలు - కీర్తిప్రతిష్ఠలా? - హా! హాహా! ఎవరికి కావలెను?- ఇవన్నియు కావలయునని యేడ్చువారి కీయరాదు? నాకెందులకు? - నన్ను మాయలో ముంచకమ్మా!

ఉ. ఈ ధనరాసు లీ మణులు నీ నిధు లీ బిరుదంబులుఁ మహా
బాధకముల్;ప్రపంచము నవశ్యము వశ్యముచేయుఁగాక శ్రీ
నాధుని పూజచేసెడు జనంబులకుఁ బలవద్విరోధముల్
గాధలడంగుచుట్లు ధనకాంక్షులకుఁ దలపోయ నమ్మరో?
నా కొక్కటియే వాంఛ - నీ దర్శనవాంఛయే.

గీ. నీదు పాదారవింద సంసేవనంబె
గాక, అన్యంబు నేయదమ్మా! కరంబు

దివ్యమా భవదీయ మూర్తిని నిరంత
రంబు దర్శింపగోరు నేత్రాలు జనని!

అమ్మా! ఇదిగో సాయంత్రమయ్యెను. సూర్యభగవాను డస్తాద్రి గుంకుచుండె. నా ఆయుర్దాయము క్షీణించి పోవుచున్నది. ఇంకను నీదర్శనము లేదు. ఈ అల్పాయుర్దాయముగల మానవుండు, నీదర్శనలాభమును పొందకున్నచో, జీవించి వ్యర్థమేగద! అమ్మా! భవతరణీ! ఈ బ్రతుకు భూమికి బరువు చేయకుము. సత్యాన్వేషణపరుండ నగు నాకు మార్గదర్శివి గావా? ఒక్కసారి కన్పడవమ్మా! చాలును! ఒక్కసారి మాటాడవమ్మా! చాలును. అభయప్రదానము చేయవమ్మా! కామక్రోధమయ మగు నీశరీరమున నేనుండజాలనమ్మా! అమ్మా! నిజముగా నీ విందుంటివా? లేదా, కవులు తమ చమత్కారమువ యోగించి వర్ణించిరా? కాదు - కాదు. నీవు తప్పక యుండుంటయే వాస్తవము. నిన్ని దివములకు దర్శింప జేసికొనిన రామప్రసాదు మొదలైనవారు, అసత్యవాదులా? నిన్ను చూచియే తీరవలయును. ఆయుర్దాయము క్షణక్షణము నశించిపోవుచున్నది. పోయినది మరల చేకూరదుగద! భగవత్ సాక్షాత్కారమే మానవజన్మకు పరమావధి యని శాస్త్రములు ఘోషించుచున్న వందురు. నే నింకెన్నడు సాక్షాత్కరింపజేసికొనగలను? ఇప్పటికే చాలకాలహరణమయ్యెనే! అయ్యో! అయ్యో! ఎవరు నాకు సహాయము చేయగలరు? ఇంకెవ్వరి నాశ్రయింతును. నే నెట్లాచరించిన, అమ్మకు సంతృప్తి కలుగునో నాకెవ్వరు చెప్పగలరు? అమ్మా! నాగతి యింతేనా?

(హృదయుడు ప్రవేశించును.)

హృద—ఇదేమిపిచ్చి మీకు? ఎక్కడ నైనను విగ్రహము మాట్లాడునా? ఇంత శ్రమపడెద రెందులకు?

గీ. అయ్యయో విగ్రహమ్ము మాట్లాడునేమి?
చెలువరాతిబొమ్మ, కరము చాచునేమి?
అంతకంతకు భక్తి హెచ్చెనఁ గొలది
అంతకంతకు పిచ్చి హెచ్చాయెనేమొ!

పాపము, శరీరము గీచుకపోయెనే! స్నానము చేయుడు. ఆహారము గైకొనుడు.

గదా—స్నానమా! ఆహారమా! అమ్మదర్శనమే లేని ఈశరీరమునకా ఉపచారములు! ఇంతపిచ్చి యెందులకంటివే! ఒక గదిలో బంగారుకడ్డీలు గలవు. దొంగవాడు చూచుచున్నాడు. మధ్య నొక తెర అడ్డున్నది. ఇంటివారు నిద్రించుచున్నారు. ఇంక క్షణములో తెల్లవారును. అతని మన స్సెట్లుండునో చెప్పుము. తహతహలాడదా? నా గతియు నట్లేయున్నది. అదిగో అమ్మ - దగ్గఱలో - కాని యేమి ప్రయోజనము? పలుకదు. అరగింపదు.

హృ—వ్యర్థప్రయాసము! ఇట్టి పిచ్చివాని పెండ్లికి ఆయమ యెంతయు బాధపడుచున్నది.

గీ. పెండ్లి గావించెనేని యీ పిచ్చికుమరు
నంచు, ఆ పిచ్చితల్లి భావించుచుండె!

పిచ్చివానికి తమ ముద్దుబిడ్డనిచ్చు
నంత పిచ్చివారుందురే! భ్రాంతిగాక!
(నిష్క్రమించును.)

గదా——నా యొనర్చు పూజలో లోటున్నదా అమ్మా! నా పాపపరిహారము కాలేదా? అమ్మా! నేనింక బ్రతుకజాలను. క్షణ మీ శరీరము ధరింపజాలను. ఇంక నీ శరీర మున్నంత వఱకు నీ దర్శనభాగ్యము కలుగదని తోచుచున్నది. ఈ వ్యర్థపు జీవిత మెందులకు? ఈ కండ లేల పెంచవలయును? ఎన్నియేం డ్లింకను పెంచవలయును. దీనిపై నింక శుభదృష్టి పరుపజాలను. ఈ శరీరమును కడతేర్చెదను. మఱొక శరీరమునం దా పూజ్యురాలి దర్శనమగునేమో? (అటు నిటు చూచి) అదిగో! ఖడ్గము - సమయమునకు సిద్ధముగనే యున్నది! (ఖడ్గము చేత ధరించి)

గీ. ఇదిగో? ఈఖడ్గమున నిడె, ఇవుడె, ఈ శ
రీర మంత మొందునుగాక! వేఱె దేహ
మును ధరించిన దర్శనమ్ము లభియించు
నేమొ! ఈ వ్యర్థపుం బ్రతు కేల ధాత్రి?

అమ్మా! ఇంక క్షణమాగను - (కత్తితో కంఠము వఱుకుకొనబోవును - కాళికాదేవి సాక్షాత్కరించి చేయి పట్టుకొనును. గదాధరుఁ డా యమ్మనుగాంచి, శరీరము మఱచి క్రింద పడును. కాళికాదేవి అంతర్ధానమగును - తెరపడును.)

## రంగము 3

### కామర్‌పుకూరు గ్రామములో నొక వీధి

[పెండ్లిండ్ల పేరయ్య — వివాహాల వీరయ్య]

పే—వీరయ్యా! ఈ నెలలో లాభనష్టా లేలాగున్నవోయి?

వీ—అన్నీ అమ్ముకొన్న అచ్చయ్యగారి కుమార్తె పెండ్లి చేయించాంగాదటోయి.

పే—నాకు తెలియకుండానే? ఆ పిల్లకు 3 పెండ్లేకాదూ? పెండ్లి కొడుకు ఎన్నేండ్లవాడు?

వీ—యేబదికి తక్కువ. అయితేనేమేం! పిడుగు లాగున్నాడు.

పే—అదేమి సంబంధమోయి! మనం డబ్బుకక్కుర్తి పడుచున్నా, కాస్త మంచీచెడ్డ చూడవద్దా?

వీ—ఆయనకు 50000 ఆస్తి గలదు. ఎవరూ తినేవాళ్ళులేరు. అంతా ఆ పిల్లదేకాదూ? ఆస్తిచూచే, వాళ్ళూ ఒప్పుకున్నారు.

పే—మన చేతిలో ఎంత పడ్డది?

వీ—అన్నీ అమ్ముకొన్న అచ్చయ్య మన కిచ్చే దేముంది? కాని పెండ్లికుమారుడే సంబంధం కుదిర్చినందుకు, చేయించినందుకు 400 రూ॥ ముట్టచెప్పినాడు.

పే—ఇంతకు ఆయన కెన్నో పెండ్లి?

వీ—అయిదో పెండ్లి.

పే—ఈ పాతకమంతా మనకు చుట్టుకుంటుందోయి! ఇదివరకే గుడిబ్రింగే గూటయ్య పెండ్లి మనము చేయించడం,

వాడు పెళ్ళి కాగానే చావడం, ఆ పిల్ల ముండా మోసిన
తరువాత అల్లరచిల్లరగా తిరగటం, గర్భం అవటం, అల్లరి
అవటం, ఈడూజోడూ లేని పెళ్ళిచేసారో, అని ఆ పిల్ల
మనల్ని చూచినచోటల్లా దుమ్మెత్తి పోయటం, జరిగింది
కాదటోయి ! ఇకనైనా బుద్ధి తెచ్చుకోకపోతే ఎలాగోయి!
పేరయ్యా! మన పిల్లల కలాగ చేస్తామటోయి? గదాధరునికి
పిల్లను కుదిర్చాం చూచావా మరి - 5 ఏండ్లు, శారద
జయరాంభట్టి గ్రామము, రామచంద్రుని కూతురోయి.

పి—నీ మొగం!నీవు కుదిర్చేదేమిటి? అతనే పిచ్చిలో భలానా
చోట పిల్ల యుంది. అడగండి, యిస్తారు అన్నాడటగాదూ?

పే—సరే!అన్నా(డనుకో!అనగానే అయిందటోయి! మేమంతా
వెళ్ళి నచ్చచెప్పి చివరకు పిల్లకు 300 రూపాయల నగలు
పెట్టేటట్లు ఏర్పాటు చేసాము.

(దళారి దామయ్య ప్రవేశము)

ద.దా—ఏమిటోయి ముచ్చటిస్తున్నారు?

పే—ఏముంది? గదాధరుని పెండ్లివిషయము.

ద.దా—కుదిర్చినవాళ్ళు మీరు లేరేమయ్యా,లగ్నమయుంలో?

పే—ఆ దేమిటోయి, మేమింకా ముహూర్తం పెట్టలేదే !

ద.దా—మీ ముహూర్తం దాకానా! నిన్న ప్రొద్దున చీవాట్ల
శివయ్యగారు జరిపించేసారు. అవసరంగా కావలెనన్నారట.

పి—వాడు మనమీద పార్టీగానుండి సాధిస్తూనే యున్నాడు.

పే—పోనీలేవోయి! ఇందులో చేతులో బడేదేమి లేదు.

ద.దా—కాసి చాలదటోయి ! ఎంతకావాలి - పోనీలెండి !

మీరు వెళ్ళకపోవడమే మంచిది. రాద్ధాంతసిద్ధాంతాలయి నాయి. సమయానికి ఎరువు నగలు తెచ్చిపెట్టారు. పెళ్ళి కాగానే ఆ నగలు అసలువాళ్ళు తెమ్మన్నారు. పిల్ల నిద్ర పోతూంటే పెళ్ళికొడుకు నగలు ఒలిచి, తల్లికిచ్చి పంపించి వేశాడు. అదేమంటే పిల్లవాడికి పిచ్చిగదా అన్నారు. పిల్లతాలూకువాళ్ళు కోపాలువచ్చి జయరాంభట్టి పిల్లను తీసుకువెళ్ళారు. ఎవరికీ ఏమీ చేతులో పడ్డదిలేదు. చివరకు పెళ్ళిళ్ళపేరయ్యా మా కొంప తీశాడో అని అల్లరి చేస్తు న్నారు వాళ్ళు.

పే—అనుకొన్నంతగా జరుపరోయి పెళ్ళివాళ్ళు. వీళ్ళతో పడ లేక చేస్తున్నాం. ఈ వృత్తిమానుకోవలెగాని.

ద.దా—మానేస్తే ఎలాగండి! మిద్దెలు మేడలు ఎవరు కట్టిస్తారు! నాల్గునెలలుగా నాకేమైనా ముట్టచెప్పారటండీ!

వి—ఏమి మేమి సంపాదించినామోయి! నీకుకూడా ఇయ్య టానికి.

ద.దా—లింగయ్యకు పిల్లను కుదర్చాలి, రావోయి పోదాం.

పే—లింగయ్యా కవరిస్తాగోయి! 70 ఏండ్ల పెళ్ళికొడుకు.

ద.దా—నీకెందుకు రావోయి! వేలు గుమ్మరిస్తానంటున్నాడు.

పే—ఇక నేను ఆడపిల్లలయుసుకు గొంతుక్కి పోసుకోలేనోయి! ఇక ఈ వృత్తి చాలించుకొంటూనోయి! ఏ పెండ్లి చేసినా 4, 5 పుచ్చుకొని పండితులు ఆశీర్వచనాలు చేసివెళ్ళడం, మగనాపు త్రాడు తెగడం. శ్రీ ఘబుద్ధి తెచ్చుకొంటున్నాను.

గీ. జన్మజన్మాల కీ వృత్తి సలుపబోను
నలుపువారితో స్నేహంబు సలుపబోను
కడకు తిండికికూడ నక్కడకుబోను
బుద్ధివచ్చెను రామయ్య! బుద్ధివచ్చె.

ద.దా—వీరయ్యగారూ! మీతో చెప్పటం మఱచినాను. సోమనాథంగారు ఇర్ సాల్ మెంటు పెట్టినారు.

వీ—తెలిసింది. వీడి మొగాన మొన్ననే 4000 రూపాయలు పెట్టినానోయి.

ద.దా—అంతా యిలాసం పాయించిందేగా! ఆ పిల్లలయుసురు ఊరికే పోతుందా! మీరుకూడా బుద్ధి తెచ్చుకోండి. రూపాయకు పావలాయైన వస్తుందిలెండి.

వీ—నిజం, నిజం. కుదిరిస్తే ఈడూజోడూ యున్నవాళ్ళకి కుదర్చాలి. లేకపోతే నోరు మూసుకోవాలి. 4 రూకలకు కక్కుర్తిపడటం, మనం అందరి నోళ్ళల్లో పడటం, మళ్ళీ వాళ్ళ మొగం మనం చూడలేక పోవడం. బాగాలేదోయి. ఈవృత్తి మానుకొంటున్నాను.

గీ. నేను మొదలుగ ఈజాడ నేను బోను
చేయు వారితో నేస్తంబు చేయబోను
కడకు కూటికిగూడ నక్కడకు బోను
బుద్ధి వచ్చెను రామయ్య! బుద్ధివచ్చె.

దా—నేనీ గొడవలకు అసలేపోనండి! ముష్టియైనా యెత్తుకొంటానుగాని.

పే—పదండి, ఈ పురాణ వైరాగ్యాలకేమి!

(తెర యెత్తబడును)

## 10 ఏండ్ల తర్వాత

### జయరాంభట్టి గ్రామము

(ఇంట్లో శారద తులసిపూజ చేయుచుండును. తండ్రి రామ చంద్ర ముఖోపాధ్యాయి ప్రవేశము)

శా—(నమస్కరించి) నాయనగారూ! దక్షిణేశ్వర సమాచారము లేమైన తెలిసినవా?

రామ—ఏమున్నదమ్మా! వారీ మధ్య కొన్ని యోగాభ్యాసములు కూడ చేయుచున్నారట. యజ్ఞోపవీతము, పైవస్త్రముకూడ దేహమున నుండుటలేదట. కొందఱు గదాధరునకు పిచ్చియనియు, కొందఱు భక్తివిశేషమనియూ చెప్పుచున్నారట. కొందఱు ఇంత జ్ఞాని నెచ్చట చూడలేదనుచుండిరట. భైరవబ్రాహ్మణీ యను యోగినివచ్చి, ఆయన అవతార పురుషుడని చెప్పినదట. పంజాబునుండి తోతాపురి యను సన్యాసి వచ్చి నిర్వికల్ప సమాధి పర్యంతముపదేశమొనర్చి పోయెనట.

శా—నాయనగారూ! అట్టి సదృష్టవంతురాలనే! వారి శుశ్రూషచేసి జ్ఞానోపదేశము నొందుదును. భార్యకు భర్తకన్న దైవము, గురువు లేరని గదా శాస్త్రములు గాని, పెద్దలుగాని నుడువుట.

రామ—చాలమంది ఆయనకు పిచ్చియే యనుచున్నారట.

శార—నాయనగారూ! నన్నింక దక్షిణేశ్వరమునకు పంపుడు.

ఎట్లున్నను నేను వారిదగ్గఱనుండుటయే గౌరవముగాదా?
అమ్మ వలదన్నను సరే! నే నింక క్షణమాగను. ఆయనకు
లోకులన్నట్లు పిచ్చియే హైనచో నా చేతనయినంత యుప
చార మొనర్చెదను. మఱికొందఱనునట్లు యోగియే
హైనచో తరించగల సాధనలు నేర్చుకొందును.

గీ. పరిజల నుడులట్లు పిచ్చియేర్పడినదేని
సేవలంజేసి వారి రక్షించుకొందుఁ
గాక భక్తియే యయ్యెనా! కరము మోడ్చి
తెలిసికొందును తరియించు తెరువు తండ్రి!

రామ—అమ్మాయీ! రేపు పూర్ణిమకు అనేకులు గంగాస్నానమునకు పోవుదురు. మన బంధువులలోకూడ కొందఱు పోవుదురు. కావున వారితో మనమును పోవుదము. నేను నిన్నచ్చట దిగబెట్టివచ్చెదను. స్థిమితముగ నుండుము. (నిష్క్రమింతురు.)

## రంగము 4

### అరణ్యము.

(రామచంద్ర ముఖోపాధ్యాయుఁడు, శారదయు ప్రవేశింతురు)

రామ—అమ్మాయీ! ఇంకను 40 మైళ్ళు నడువవలయును, ఇప్పటికి 40 మైళ్లు నడచి వచ్చితిమి.

శారద—నాయనగారూ! ఇంక నేను నడువలేని స్థితిలోనున్నాను. జ్వరబాధితురాలనై యుంటిని. ఇంతకును అమవాసియని నేనాభాగ్యము నా కున్నదో లేదోగద. మనతో వచ్చుస

బంధువులు ముందు పోయినట్లున్నారు. మనము కొంచెము విశ్రమింతము.

(ఇరువురు పరుండి నిద్రింతురు - కాళికాదేవి 10 సం॥ముల పిల్లయై వచ్చి శారదకు సేవచేయును.)

శా—(కొంచెము లేచి) అమ్మాయీ! నీ వెవరి పిల్లవు? ఎక్కడనుండి వచ్చితివి?

పిల్ల—దక్షిణేశ్వరాలయమునుండి వచ్చితిని. నాకు తల్లిదండ్రులు లేరు.

శా—నీకు పెండ్లి కాలేదా?

పిల్ల—పెండ్లి కాలేదు-కాని బిడ్డ లున్నారు నీవును నా బిడ్డవే. కావుననే నీకు సేవచేయుచున్నాను.

శా—మీ వారలు నా కష్టమువుట లేదు - ఐనను జ్వరబాధచే కాళ్ళుజాలక పడియుంటిని.

పిల్ల—జ్వరబాధ నీ కింక యుండదు. నీ నిమిత్తము మీవారు దేవాలయమునందే గలరు. నీ నిమిత్తమై పల్లకి కూడ రాగలదు.

శా—ఇంత సహాయముచేయుచున్న నీవు నా పాలి దైవమవు గాని పిల్లవు కావు.

పిల్ల—నిజముగా నేను పిల్లను కాను; చూడుము - మూడులోకములకు తల్లిని.

(కాళీ దర్శన మిచ్చును) (పిల్ల అదృశ్య మగును)

శా—అమ్మా! వందనములు.

గీ. మూడులోకమ్ము లేలెడు ముద్దుగుమ్మ
అఘటన ఘటనా సామర్థ్య అఘవినాశి
అద్భుతానంత తేజమ్ము అమ్మ అమ్మ!
బిడ్డపై నెంత ప్రేమ చూపితివి తల్లి!

(కాళికాదేవి అదృశ్యురా లగును)

(శారద మఱల నిద్రించును.)

రామ—(లేచి) అమ్మాయీ! ఇంక లేచి ప్రయాణము మెల్లగా సాగింతుమా!

శా—నాయనగారూ! నా కొక చక్కని దృశ్యము లభించెను. కలయో, నిక్కమో చెప్పజాలను. కాళికాదేవి దర్శన మిచ్చి, నా ఆరోగ్యభాగ్యము చేకూర్చెను. మన ప్రయాణముకూడ సుఖకరముగు నని చెప్పి అదృశ్యురా లయ్యెను.

రామ—(చూచి) అరుగో పల్లకి బోయీలు.

శా—జగజ్జనని కృప. (నిష్క్రమింతురు.)

రంగము 5

(శ్రీరామకృష్ణుడు కాళికాపూజ చేయుచుండును)

దక్షిణేశ్వరాలయము

(రామచంద్ర ముఖోపాధ్యాయియు - శారదయు ప్రవేశింతురు)
శారద వందనము చేయును.

రామ—ఆర్యా! ఇదిగో తమ అర్ధాంగ లక్ష్మి!

శా—తమ సేవచే ధన్యురాలనై మోక్షమార్గము చూచు

కొనుటకే వచ్చితిని. తమ ఆజ్ఞాప్రకారము కష్ట మనక సాధనలు చేసికొందును.

గీ. ప్రాణనాథ! మీపాదసేవనము నాకు
దాశరథిసేవ, భవదీయదర్శనంబె
జానకీపతి దర్శనోత్సవము; పుణ్య
వశముచేత ధన్యాత్మ! మీ పత్నినైతి!

రామకృ—ఇప్పు డిచ్చట నున్నది నిన్ను పెండ్లాడిన గదాధరుడు కాడు. ప్రపంచమంతయు కాళికాదేవిగా భావించు కాళీ దాసుడు. కావున నీ పతిత్వమునకు జలాంజలి యొసంగి, అమ్మవారి సేవ చేసికొనుచుందును. నీయెడల గల నాముఖ్య ప్రేమ భావ్యములు స్వాహాంతకును.

శా—తమ ఆజ్ఞ—(కండ్రిని జూచి)

నాయనగారూ! నాకేమియు భయము లేదు.

గీ. దేవి కాన్పించ నేమొ? శోభించ సీతను
దేవి పల్కాడె నేమొ? శాంతించె నితకు
అమ్మ అక్కున జేర్చి, దా నభయ మిచ్చె
నేమొ! ఈతని మోహనసం దేనగు శోభ!

మీరు వెళ్లి అమ్మకు మా క్షేమసమాచారములు తెలియ జేయుడు.

(రామచంద్ర ముఖోపాధ్యాయ నిష్క్రమించును.)

రామకృ—శారదా! అటు చూచితివా! గగన మెంతనిర్మల ముగా నున్నదో.

శా—అవును. అతిస్వచ్ఛముగా నున్నది.

రామకృ—మనస్సుగూడ నంత స్వచ్ఛముగానిచో ప్రయోజనము లేదు. కామక్రోధాది మాలిన్యములనుండి శుద్ధమొనర్ప వలయును - ఆ తటాకోదకము చూచితివా! ఎట్లు కదల కున్నదో!

శా—అవును. అందువలననే వృక్షచ్ఛాయలు స్పష్టముగా గన్పించుచున్నవి.

రామకృ—అట్లే మనస్సుగూడ నిశ్చలమైనచో నీ వెవరో నీవు తెలిసికొనగలవు. - ఆ ప్రొద్దుతిరుగుడు పూవు చూచితివా!

శా—ఔను. దాని చూపంతయు సూర్యభగవానుని పైననే యున్నది.

రామకృ—అట్లే మనస్సంతయు పరమేశ్వరిపై పునకే అహర్నిశలు త్రిప్ప యత్నింపవలయును—హృదయా!

(హృదయుడు ప్రవేశించును.)

రామకృ—పెద్దపీటయు, పూజాద్రవ్యములు తెమ్ము. (హృదయుడు తెచ్చును)

రామకృ—శారదా! ఆ పీటపై కూర్చుండుము.

శా—నా కెందులకో బోధపడకున్నది.

రామకృ—నీకును కాళికా దేవికిని భేదములేదు. నిన్ను పూజింపవలయును. అప్పటికిగాని దేవీపూజాపరుల సిద్ధి సంపూర్ణము కాదు. నీ మన స్సు జగజ్జననియందే యుంచుము. కూర్చుండుము.

శా—(కూర్చుండును. రామకృష్ణుడు శారదను స్త్రీయముగా పూజించును. శారద తన్మయత్వమును నుండును.)

(కాళికాదేవి సాక్షాత్కరించును)

రామకృ—(వందనము చేసి లేచును)

కాళికాదేవి—నాయనా! దేవీ పూజాపరులు సిద్ధిపొందుటరుదు. నీవట్టి ఘనకార్యమును సాధించితివి. నీకింక సంసార భయము లేదు. లోకశ్రేయస్సునకై ఇతరమతసాంప్రదాయముల సత్యత్వమును అనుభవించి గ్రహింపుము. నీ అనుభవము నీ దగ్గరకు వచ్చువారి కందరకు నుపయోగించును.

రామకృ—మహాప్రసాదము.

(తెర పడును)

రంగము 6

కలకత్తా పట్టణ వీధి

నవనాగరికత సూచించు నరేంద్రుని గది

[నరేంద్రుడు చిరాకు, దీర్ఘాలోచన సూచించు ముఖముతో ప్రవేశించును.]

(తనలో)

బ్రహ్మసమాజములో సభ్యుడుగా చేరి ప్రతిమతము తలచి తలచి చూచుచుంటిని, ఈ సందేహము నా కింకను తీరలేదు. ఈ బ్రాహ్మసమాజమత గురువులు దేవునికి రూపము లేదని మాటిమాటికి చెప్పుచున్నారు. రూపము లేని వానిని చూచుట అసంభవము గదా! బంగాళ దేశమునందేమి మహా

రాష్ట్రదేశమునం దేమి, ఆంధ్రదేశమునం దేమి; పాశ్చాత్య దేశములయం దేమి? ఆ యా దేశచరిత్రలు చూచినచో, భగవంతుడు భక్తులకు దర్శన మిచ్చినట్లు స్పష్టముగా కాన్పించుచుండె. అట్లయిన భగవంతునకు రూప ముండవలయును. దీని కంగీకరించిన వీరి వాక్యముల కేమందుము? —— భగవంతు డుండెనా? ఆయన దయాసముద్రుడేనా? పక్షపాత రహితు డేనా? ఆయన అంతట నుండే డైనచో, సృష్టియం దీ భేదము లేల? ఒకడు దరిద్రుడు - ఇంకొకడు ధనవంతుడా? ఒకడు కురూపి - ఇంకొకడు సురూపియా? ఒకడు భిక్షాటకుడు - ఇంకొకడు చక్రవర్తియా? ఒకడు దుఃఖి - ఇంకొకడు సుఖియా! కలవారి కజీర్ణరోగబాధ - తినగోరువానికి తిండిలేని బాధ - ఇదంతయు భగవంతుని లీల యని వైష్ణవమతము సమర్థించుచున్నది. గంపెడు పిల్లలుగల సంసారము కలిగి, తినుటకు తిండి లేక మలమల మాడెడు సంసారికి ఈ సిద్ధాంతము రుచించునా? పిల్లికి చెలగాటము ఎలుకకు ప్రాణసంకటము వలె నున్నది.

సుఖమా! ఎక్కడి సుఖము! ఎక్కడి సుఖము! తొంబది తొమ్మిది సుఖము లున్నను తృప్తిలేక ప్రతివాడును నూరవ సుఖమునకై ప్రాకులాడు చుండెను. దీనిని బట్టి తరచి చూడ నీ ప్రపంచము దుఃఖమయ మనిగాని, సుఖదుఃఖ మిశ్రమ మనిగాని తెలియబడు చున్నది.

మహా సౌధాగ్రభాగమున హంసతూలికా తల్పమున సఖీపరివృతుడై, భోగలాలసు డైన చక్రవర్తియును, సూర్యచంద్రులే దివిటీలుగా గల కుటీరమున వసించు నిరుపేద వాడును,

సౌష్ఠవ శరీరము గల ఉకృతురగ వంటి బలిష్ఠుడును, పదివేల మంది శిష్యులచే మానను పూటలు, పాదపూజలు చేయించు కొనుచు తత్త్వమస్యాది మహావాక్యములు తేటతెల్లముగా వినువారి యుల్లములు పల్లవింపజేయు గురు శిఖామణియు, ఎవరి వల్లనుభయము నొందకున్నను, కాలానలసన్నిభం బగు మృత్యు దేవతా దంష్ట్రా కరాళవదనమును తలంచినంత మాత్రముననే, గుండెలు తల్లడిల్ల, శరీరము కంపింప, కన్నుల నశ్రుధార గార్చు టకు సిద్ధపడుచుండుట లోకానుభవముగద - మానవునకు నిర్భయత్వ మెట్లు గలుగును? మానవుం డు దుఃఖ పడుట కేనా సృష్టింప బడెను? పంచేంద్రియ జన్యంబులును, ఆద్యంతములును నగు ఈ ప్రాపంచిక సౌఖ్య పరంపరలలో మున్గి తేలుటయేనా దీని గమ్యస్థానము? దుర్గంధభూయిష్ఠమును అసహ్యమును, మల మూత్రముల నిధానము ను అగు [illegible] ప్రవేశమును మరల పొందని మార్గమే లేదా!

(తెరలో) అబ్బాయీ! నాయనగారు పిలుచుచున్నారు!—

ఔను, నాయనగారు పిలిచిన కారణము నాకు తెలియును. చావు బ్రతుకుల సమస్య నిర్ధరించుకొనలేక, నే నల్లాడుచుండ 'వివాహమో వినాహమో' యని వీరు నన్ను నిర్బంధించుచున్నారు. పెండ్లి యట,-చేయుదురట!- పదివేల రూపాయల కట్నమట—ఐసియస్ కు నన్ను లండన్ పంపించెదరట- వారి యుద్దేశ్యము లన్నియు, నన్ను మృత్యుభయము నుండి తప్పించి, శాశ్వతానందసుఖమును ఇవ్వగలవు కాబోలు! పోనిమ్ము, పెండ్లి కంగీకరింతును; అప్పుడు కల్గు భాగ్యమున్నది? నాకు

లభించునవి ప్రాపంచిక గౌరవమును సంపాదింప గల లౌకిక విద్యాధికృత - ధనము - ఒక పడుచుపిల్ల - నూతన బంధుత్వ ములు-ఈ విద్యవలన గాని, ధనమువలనగాని, భార్యవలనగాని, నూతన బాంధవ్యమువలన గాని మృత్యుభయము తప్పునా?

సంసారాంధకారారణ్యానలమున బడి దగ్ధుడ నగుట నేను గాని, వారు కారు కద. ఓ భగవానుడా! నీ వొకృడ వున్నచో ప్రపంచసుఖముల వాత నన్ను బడ ద్రోయకుము!

(అలమారలో పుస్తకము తీసి, చూచి విసరివైచి)

చదువువలన భగవంతుని తెలిసికొనుటకు వీలులేదట. మహానీయు లందఱు అట్లే చెప్పుచున్నారు! చదువు లన్నియు పొట్టకూటికే ప్రయోజనకారు లట. జగద్గురు శంకరాచార్య స్వామివారు వివేకచూడామణిలో చెప్పలేదా? 'వాగ్వైఖరీ, శబ్దఝరీ, శాస్త్ర వ్యాఖ్యానకౌశలం, వైదుష్యా విదుషాం తద్వ ద్భుక్తయే నతు ముక్తయే.'

గీ. అటులె పండితు లగువారి అలఘువిద్య
మాటబొంక ముపన్యాస పాటవంబు
శాస్త్రముల యర్థములుచెప్పు శక్తి యెల్ల
భుక్తికేగాని ముక్తికిపోవ గాదు.

(పద్యం శ్రీపూరి పట్టాభిరామశర్మగారిది)

ఓహో! అట్టి విద్యకై జీవితకాల మెంత పాడొనర్చితిని! ఎన్ని న్యర్థగ్రంథముల సారాంశ మీ బుద్ధిగుహలో ప్రవేశపెట్టి తిని. ఎంతధనము - ఆరోగ్యధనము - వ్యయమైనది. (మఱొక గ్రంథము తీసి, చూచి పాఱవైచి) ఒకటియా! రెండా! అన్ని

మత గ్రంథములు చదివి యుంటినే. ప్రకృతి శాస్త్రవేత్తల పరిశోధన లన్నియు గమనించితినే! ఈ గ్రంథములలో నేమున్నది! దేవుడా! దయ్యమా!

(ముందునకు నచ్చును - తెరపడును.)

(వసారలోనికి వచ్చి ఒకవైపు చూచి)

ఆహా! ఏమి ఈ సృష్టి! ఎవని ఆజ్ఞలకో వెఱచి సూర్య చంద్రులు తమనియతులు తప్పకున్నారు! ఎవని ఆజ్ఞలకో వెఱచి, సముద్రుడు తన మేర దాటకున్నాడు. ఎవని ఆజ్ఞలకో వెఱచి ఋతువులు, సక్రమముగ ఫల భండారముల నొసగు చున్నట్లున్నది. ఎవని ఆజ్ఞలకో వెఱచి శ్రోత్రియ బృందములు బ్రాహ్మ ముహూర్తమున లేచి ధ్యాన మొనరించుచున్నారు. ఆత డెవ్వడో? ఎట్లుండునో! ఎక్కడ నుండునో! ఈ విషయము నాకు బోధపఱచువా రెవ్వరు! (ఆలోచించి)ఔను! ఠాకూరు దేవేంద్ర నాథు డున్నాడు గద - విద్యావంతుడు - పేరు ప్రతిష్ఠలు గల వాడు - ఆధ్యాత్మికచింతాతత్పరుడు - శిష్య బృందమును సంపాదించినవాడు - ప్రజలుగూడ నీ మహాశయుడు తెలిసిన వా డందురు. వారి దర్శనము చేసి భగవంతుడున్నాడో, లేడో తెలిసికొందును గాక.

(తెరలో) నాయనా! భోజనమునకు రారా! వేళ యైనది!

భోజనమా! వేళకు భోజనమైనచో కుమారుని మెడల తల్లికి సంతృప్తి! నా మనోవ్యథ, అమ్మకే మెఱుక ! ఈ వ్యథాగ్నిని మాతృ ప్రేమరసము చలార్పగలదా!

గీ. తన కుమారుడు; వేళ కింతగ భుజించి
నెలకు కొంత సంపాదించి నిలువఁజేసి,
పిల్లలఁ గనుచున్న తృప్తి యగు తల్లి
కమ్మ కుండునా? కొడుకు మోక్షాభిలాష!

ఈ విషయమున మాతృ మెవరికి వారే ప్రయత్నింప వలయు నని శ్రీకృష్ణప్రభువు చెప్పలేదా? భగవద్గీతలో—; జగద్గురువు శంకరాచార్యస్వామి వివేకచూడామణిలో పల్కక లేదా? - మహర్షి దేవేంద్రనాథ ఠాకూరు వారి దర్శనమునకై పోయెదను.

(నిష్క్రమించును - తెర యెత్తబడును.)

తోటలో శ్రీరామకృష్ణుడు

ప్రపంచమునందలి జీవరాసు లందఱు పరమేశ్వరుని బిడ్డలై యుండ ఇందు బాహ్యులగు వారుందురా? పరమేశ్వరుని విశ్వరూపము వదలి చీమయైనను వేరుగా నుండగలదా? అమ్మ ఆజ్ఞానుసారముగా క్రైస్తవమత ప్రవక్త యగు యేసు క్రీస్తు దర్శనమునకై సాధింతును.

ఓ మహాప్రవక్తా! నీ పరిశుద్ధ జీవితముచే వాతావరణము శుద్ధమయ్యె. నీ అఖండబ్రహ్మచర్య దీక్షచే లోకంబుల కాదర్శకుఁడ వైతివి. నీ పరమశాంతప్రవృత్తిచే అజాత శత్రుండవైతివి. నీవును, నీ పరలోకములో తండ్రియు నొక టియే యని అద్వైత సిద్ధాంతమును వెదజల్లితివి. మహాను భావా! నా కొక్కసారి దర్శన మీయరావా? నా సత్యాను భవ వృక్షంబునకు నీరు పోయవా?

గీ. దర్శనంబీయ రావ! శుద్ధ మగు మూర్తి!
వేగిమ్రొక్కెదను నన్ను దీవింప రావ!
పాప పరితాపమును తలమోపికొంట
నీదు సహజస్వభావము నిర్మలాత్మ!
(యేసు సాక్షాత్కరించును)

శ్రీరా—ఓహో! యేసు! ఆ విశాలవక్షస్థలము, సుందర నాసిక, విస్తృతవదనమండలము. ఆర్యా! ఏమని తమ సందేశము:

యేసు—పరమహంసా! అన్ని మతములలో నొకే సత్యమున్న దనియు, ఏ మతమునైనను చక్కగా సద్గుణము చేసికొని, జీవించిన ప్రతివారు ప్రేమపాత్రులగుదు రనియు, మతవైషమ్యములు తొలగవలెననియు, లోకమునకు చాటుము! ఈ మహాసత్య సందేశము మీ మూలముగాన లోకమున బడవలయు నని లోకపితృప్రభువువారి యాజ్ఞ. (అంతర్ధాన మగును)

శ్రీరామ—ఇక ఇస్లాముమతమునందలి సత్యసందేశమును ఆచరణయందుంచుకొందును. అల్లాహో! అక్బర్! (నమాజు చేయును) (మైమరచి యుండును.)

హృదయుడు—(స్వ) ఏమి! ఈ మహాత్ముడు మైమరచియున్నాడే.

శ్రీరా—(లేచి) ఆహా! ఈ మతమునందును ఆ నిరాకార పరబ్రహ్మానుభవమే గోచరమయ్యెను. సత్యమను మహమ్మదీయ మతమునందును ఒకటిగనే యుండెను!

హృద—తామిప్పుడు తురకమత మవలంబించిరా!

శ్రీరా—హృదయా! మతము లన్నియు అన్నిమార్గములు. ఏమార్గమున బోయినను సక్రమముగా పోయినచో సత్యము గోచరించును. అందు సందియమే లేదు. ఇదంతయు నమ్మ కృపచేఁ దెలియనయ్యె. హృదయా! పొమ్ము. పూలు సిద్ధము చేయుము. (హృ — నిష్క్రమించును.)

కాళికా—(సాక్షాత్కరించి) ఇదంతయు ధారపోయుటకు — సర్వమతసామరస్యానుభవామృతమును పంచి పెట్టుటకు. అర్హత గలవానిని నేనే నీ యొద్దకు పంపుదును. నీ కా విచార మేల?

శ్రీరా—ధన్యుడను జగజ్జననీ! ధన్యుడను.

(తెర పడును)

## రంగము 7

### తోటలో శ్రీరామకృష్ణుడు

(స్వగ) శ్రీరామకృష్ణా ద్యవతారమూర్తు లందఱును తన రూపమే యని అమ్మ చెప్పుచున్నది. అదిగాక వారి సాక్షాత్కారము గావలయు నన్నచో వారివారి రూపనామముల యందే మనస్సు ధారణచేయు టావశ్యక మనియును అమ్మ చెప్పినది. దీని యథార్థము ననుభవములో చూడవలయును. ప్రస్తుతము శ్రీకృష్ణధ్యానము చేయుదును. (ప్రకాశముగ)

సీ. శ్రీకృష్ణనామంబు చిన్మయానందంబు
శుభదంబు సుఖదంబు సురుచిరంబు
శ్రీకృష్ణనామంబు జీవనాధారంబు
చెలువంబు లలితంబు శ్రీకరంబు

శ్రీకృష్ణనామంబు చిత్తశాంతికరంబు
భవబంధపతనంబు పావనంబు
శ్రీకృష్ణనామంబు ప్రేమైక ధామంబు
మామనోహరణంబు మానితంబు

గీ. ఉగ్రవాక్రూర భీష్ములు బద్ధవైరు
లైన శిశుపాల, కంస, ధరాధినాథు
లఖిలగోపాంగనామణు లద్భుతముగ
చేరి రా మోక్ష మీ నామచింతనమున!

ప్రభూ! గోపాలకృష్ణా! నీ దర్శనభాగ్య మిప్పించి గీతా సార ముపదేశించవా? - ఓ వృక్షములారా! మా గోపాల కృష్ణుని జాడ నెఱుంగరా?

గీ. నల్లనగువాడు నగుమోమునకు చెలంగు
వాడు వాడని కమలపుష్పముల నేత్ర
ములు గలట్టివాడు మురళి పూనువాడు
చల్లని కటాక్షమాలికల్ చల్లువాడు.

ఎన్నడో! ప్రభుదర్శనము.

(శ్రీకృష్ణుడు సాక్షాత్కరించును)

శ్రీరామ—(సాష్టాంగ వందనము చేయును)

శ్రీకృ—రామకృష్ణా! నీ అనన్యభక్తి అసాధారణ మైనది. నా గీతాసారమే నీ రూపమున మూర్తీభవించె. అంత్యకాల నా నామస్మరణమే జీవులకు సులభసాధనోపాయంబు. సర్వ మతసామరస్యమే నా ఆదేశము. ధన్యోఽసి.

శ్రీరామ—ధన్యుడను.

(శ్రీకృష్ణుం డటు లంతర్ధాన మగును)

(హృదయుడు ప్రవేశించును)

హృద—ఆర్యా! ఎవ్వ రటు పోయిన వ్యక్తి?

శ్రీరా—శ్రీకృష్ణప్రభువు.

హృద—తమకు దర్శన మిచ్చెనా? ఆశ్చర్యము!

శ్రీరా—అనన్యభక్తి చేసిన వారి కెవ్వరి కీయలేదు? హా కృష్ణా! నన్ను విడనాడితివా? - (మూర్ఛిల్లును)

హృద—వీరు మతాల సీ పిచ్చిలో పడిరి. ఈ పిచ్చి ఎప్పటికి వదలునో తెలియదు- నేను పోయి పూవులు కోసి తెత్తును.

(నిష్క్రమించును)

శ్రీరా—స్వగ) ఇప్పుడు శ్రీరామచంద్రమూర్తి దర్శనమునకై ధ్యాన మొనరింతును.

శా. భక్తత్రాణపరాయణుండ వని, నిన్ బ్రార్థించుచున్నాడ నా
సక్తిన్, సంసరణంపు సౌఖ్యముల నాసల్ చేయ లేశంబు; నే
యుక్తుల్ సిబ్బరితృప్తి చేయు పని నాయిష్టాంగనా ధ్యాసినై
ముక్తిన్ గోరుదు; రామా! తావకకృపాంభోరాశిం దేలింపవే!

(శ్రీరామచంద్రుడు సాక్షాత్కరించును)

శ్రీరా—ధన్యుడను. (సాష్టాంగదండ మొనర్చును.)

శ్రీరామ — రామకృష్ణా! ధన్యుడవు - ధర్మబద్ధ మగు జీవితము లనే, నేను ప్రేమింపగలను - నేను చెప్పుటకు గాక, చేసి చూపించుటకే వచ్చితిని - చూపించితిని.

(శ్రీరామచంద్రమూర్తి అటు లంతర్ధాన మగును)

శ్రీరా —

సీ. మొలకనవ్వులవాడు ముద్దు మొగమువాడు
యెదుట కాన్పించె నా డిప్పు డేడి!
నీలదేహమువాడు నీలంపు టుంగరాల్
ముంగురుల్ గల మోహనాంగు డేడి!
చిలుతగజ్జెలకాళ్ల చిందులు ద్రొక్కెడు
చిన్నారి పొన్నారి చిలుత డేడి!
వాంఛించినంతనే వాత్సల్యమునను ద
ర్శన మిచ్చు నా రామచంద్రు డేడి!
గీ. నా యొసర్చిన పాపసంకలన మేమొ
నా నిధానంబు; నా రతనాలపేటి
నా మురువు; నా మురిపువు; నను గన్నతండ్రి
ఎందు నున్నాడొ! దా నిప్పు డేల చనెనో?

(హృదయుడు ప్రవేశించును.)

హృద — అయ్యా! ఆ ఆలాపన మేమి! అటు పోయినవా రెవరు!

శ్రీరా — శ్రీరామచంద్రమూర్తి — నా ప్రభువు -

హృద — నే నప్పుడే తలంచితిని. మీకు మరల పిచ్చిపట్టు నని. అమ్మగారికి పూజసేయు వేళ కాలేదా!-

శ్రీరా—ఔను - మఱచితిని - అమ్మ! - జగజ్జనని! - కాళీ మాయి! - కాళీమాయి! - (తన్మయుడగును.)

హృద—నేను పోయి పూవులు తెత్తును.
(నిష్క్రమించును) (తెరపడును.)

రంగము 8

దేవేంద్రనాధ఼ ఠాకూరు శిష్యులకు బోధించుచుండును.

దే—విద్యార్థులారా! మీరు బాల్యమునుండియు భక్తి నభ్యసింప వలయును. అందులకు సత్సాంగత్యమే ప్రథమ సోపానముగ తలంపవలయు. నాయనా! సురేశ్ భగవద్గీతలోని 8 వ అధ్యాయములోని 9 వ శ్లోకమును చెప్పుము.

సురేశ్—"కవిం పురాణ మను శాసితార
మణోరణీయాంసమనుస్మరే ద్యః,
సర్వస్య ధాతార మచింత్యరూప
మాదిత్యవర్ణం తమసః పరస్తాత్.

దే—దాని అర్థమును చెప్పుము.

సురేశ్—భగవంతుడు సర్వజ్ఞుడు. అనాదిగా నున్నవాడు. జ్ఞానస్వరూపుడు. అణువులలో అణువు. గొప్ప పదార్థములలో గొప్పపదార్థము. చింతించుట కలవిగాని రూపముగలవాడు.

దే—చూచితిరా! విద్యార్థులారా! అట్టి భగవంతునికి రూప కల్పన చేయుటచే హిందూమతమునం దనేకములగు విగ్రహారాధనలు బయలుదేఱినవి. ఈ కారణమున మా

విగ్రహ మిట్లుండు నని, మా విగ్రహ మట్లుండు నని, మా దేవుడు తక్కువ యని, మా దేవు డెక్కువ యని ప్రజలలో కలహములు ప్రారంభమై అజ్ఞానమువృద్ధి యగుచున్నది. ఐకమత్యము చెడుచున్నది. మన మందఱ మొకే భగవంతుని బిడ్డలము. కులభేదములు, జాతిభేదములు ఛేదించవలయును. భగవంతుని దృష్టియం దందఱు సమానులే. స్త్రీలకు పురుషులతో పాటు విద్య నేర్పించి సమానహక్కులు పొందించుటకు పాటుపడవలయును. మా జీవితములు దేశసేవకై యర్పించుదుము. బ్రహ్మకృపా హి కేవలమ్!

అందఱు—బ్రహ్మకృపా హి కేవలమ్! (లేచి నిల్చబడుదురు)

(నరేంద్రుడు వచ్చి నమస్కరించును)

దే—ఓహో! నరేంద్రుడు వచ్చినాడే! విద్యార్థులారా! ఈతడు కుతూహలవంటివాడు. ఏయే మతమునందుగల, ఏయే గ్రంథకర్తలు రచించిన ఆధ్యాత్మిక గ్రంథములన్నియు నీతడు చదివియుండెను. సూక్ష్మగ్రాహి.

నరేం—మహర్షిసత్తమా! నా జీవిత మిప్పుడొక గొప్ప సమస్య నిర్ధరించుకొనలేక చిక్కులో బడియున్నది. నా సందేహములు తమరు తీర్చగలరను ఆశతో వచ్చియుంటిని. తెలుపవలయుదురా!

దే—నాయనా! అందులకు సందేహ మెందులకు!

నరేం—Mahasaya! Have you seen God?

మహాశయా! తమరు భగవంతుని చూచియున్నారా!

దే—(నిర్ఘాంతపడి, స్వస్థచిత్తుడై) my boy! you have got yogi's eyes! నాయనా! నీకు యోగదృష్టి కలదులే!

(నరేంద్రుడు నిరాశాసూచకమగు వదనముతో ముందునకునచ్చును - తెరపడును.)

ఇదేమి ప్రత్యుత్తరము? ఆధ్యాత్మిక విద్యాప్రపంచమున స్వేచ్ఛావిహార మొనర్చు మహనీయుడనియు, అద్వితీయ పాండితీ శేముషీధురీణు డనియు, భారతదేశమున నమోఘమగు పేరు ప్రతిష్ఠలు సంపాదించినవాడనియు, సాధనాపరంపరలలో రాత్రింబవళ్లు మునిగితేలిన వైరాగ్యశిఖామణియనియు, భగవత్సాక్షాత్కార మొందిన మహనీయు డనియు గంపెడాశతో వచ్చితినిగాని నా ఆశలన్నియు నిష్ఫలము లయ్యెను.

ఇంతటి మహనీయుడే భగవద్దర్శనము చేసితి నని ధైర్యముగ చెప్పజాలనప్పుడు తదితరులమాట చెప్పవలయునా? ఇచ్చటకు వచ్చినందువలన భగవంతుడున్నాడో లేడో యను ప్రశ్న నన్ను బాధించుచున్నదేగాని, నాకు చిత్తశాంతి కలుగ లేదు. 'భగవంతుని నేను చూచితిని' అని ఏ మహనీయుడైనను చెప్పిన తరువాత గద సాకారుడో నిరాకారుడో యని ప్రశ్నించుట? ఆయన నెవ్వరు చూచినవారే లేరా? లోకము గొడ్డుపోయినదా? ఆయన యునికియే అబద్ధమా? అబద్ధమని పూర్వపు మహర్షు లెవ్వరును చెప్పియుండలేదు. అనేక పరిశోధనలు చేయుచున్న పాశ్చాత్యశాస్త్రవేత్తలును, తమ కందరాని విషయము లెన్నియో గలవని నొక్కి వక్కాణించుచున్నారు. —ఈ విషయమై వారు మాత్రమేమి చెప్పగలరు?

(సురేశ్ ప్రవేశించును)

సురేశ్—అరే! నరేన్! అట్టి పెద్ద ప్రశ్నలను మనము పెద్ద వారిని వేయవచ్చునా? కొంచెతన మనిపించుకోనదు?

నరేన్—మిత్రమా! వారు భగవంతుని చూచితినని గాని, చూడలేదనిగాని స్పష్టముగ, నిర్భయముగ చెప్ప వచ్చును గదా.

సురే—పదిమందిలో చూడలేదని చెప్పినచో అవమానము, అగౌరవము. చూచితినని చెప్పినచో చూపించుమందువు. కావున వారు యుక్తిగ తప్పించుకొందురు. పోనీ! పేరుగల స్వాములనేకులు గలరు. వారిని కలసికొందువుగాని రమ్ము. వారు నీ సందేహము తీర్చగల రేమో చూచెదము.

నరేన్—నరే పద—(నిష్క్రమింతురు) (తెర యెత్తబడును).

రంగము 9

కలకత్తాలో వీధి

లక్ష్మి మందిరము

పరబ్రహ్మానంద స్వాములవారు, శిష్యురాండ్రు, సుబ్బమ్మ, సూరమ్మ, ఇతరులు కూర్చుందురు.

స్వాములవారు లేచి:—

పూజ్యులగు గృహస్థులారా! ఆత్మసోదర సోదరీమణు లారా! పరమానంద స్వరూపులారా! శుద్ధచైతన్య స్వరూపు లారా! హిమాలయ పర్వతములో అనేక సంవత్సరములు తపస్సుచేసిన ఒక ఋషిపుంగవుని కటాక్షముచే నాకు లభించిన ఒక మహామంత్రమును అందరికి యుపయోగార్థమై నివియోగ

పఱచుచున్నాను. ఎవ్వరెవ్వరు ఋణబాధలు తొలగిపోవలయు నని తలంచుచున్నారో, ఎవ్వరెవ్వరు తమ ఆడుబిడ్డల పెండ్లిండ్ల నిమిత్తము కష్టములకై ధనాభావముచే బాధపడుచుండిరో ముఖ్యముగా నట్టివారిని కటాక్షించుటకొఱకై కొండలలో తపస్సు చేయవలసిన నేను మీ మధ్యకు వచ్చియున్నాను. నా విషయము నేను చెప్పుకొనినచో ఆత్మస్తుతి యగును. నాకు భగవత్ సాక్షాత్కారమైన సంగతి మా శిష్యురాలు సుబ్బమ్మకు చక్కగా తెలియును.

సుబ్బమ్మ—(లేచి) అయ్యలారా ! అమ్మలారా ! మన అదృష్టమువలన స్వాములవారు మనకు లభించినారు. ఇపుడు స్వాములవారు లక్ష్మీపూజ చేయుదురు. వారు చెప్పరు గాని బిడ్డలులేనివారికి బిడ్డలు పుట్టించెదరు. లక్ష్మీదేవిని స్వాములవారు స్వయముగా నలంకరింతురు. మీ మీ ఆభరణము లన్నియు తీసియుండు. రేపు మఱల మీ ఆభరణములు మీకు వచ్చునపుడు మీ కోర్కెలు సిద్ధింప గలవు.

(స్త్రీలు ఆభరణములు తీసియిత్తురు.)

పురుషుడు—మా యిల్లాలు వచ్చుటకు వీలులేదు ఆభరణములు తెచ్చి నేనీయవచ్చునా? దానికి సంతానవాంఛ హెచ్చు.

సుబ్బమ్మ—అందుకు సందేహమా ! తక్షణము తెమ్ము. పూజజరుగుచుండును.

(పురుషుడు నిష్క్రమించును.)

(అమ్మవారికి స్వాములవారు పూజచేయుదురు.)

సుబ్బమ్మ— నాయనలారా! లక్ష్మీపూజ పూర్తియైనది. స్వాములవారి పద్ధతులు చెప్పుచున్నాను వినుడు. భగవద్దర్శనము కావలసినవారు రెండువందల రూపాయలిచ్చి రశీదు పుచ్చుకొనుడు. జ్యోతిర్దర్శనము కావలసినవారు 1000 రూపాయలు తెచ్చియిచ్చి రశీదు పుచ్చుకొనుడు. స్వాములవారు క్రొత్తగా ఒక యేర్పాటుచేసియున్నారు. ఎవరైనను 200 రూపాయలిచ్చి చచ్చివచో వారికి దాని వడ్డీతో శ్రాద్ధమునుపెట్టుదురు. వారు పరమపదించిన తరువాత వారి శిష్యులే ఆ శ్రాద్ధమును పెట్టుదురు. స్వాములవారికి మతభేదమేమాత్రములేదు. వైష్ణవమతము పుచ్చుకొ దలచినవారికి చక్రాంకనములు చేయుదురు. అందులకు 75 రూ॥ మాత్రమే పుచ్చుకొందురు. ఈ సొమ్ము వారు మఠమునకై యుపయోగింతురు. వారికి సొమ్మక్కఱలేదు. ప్రస్తుతం మఠములో ఎలక్ట్రిదీపములు, విసనకఱ్ఱలు పెట్టించవలయును. 116 రూ॥ ఇచ్చినవారు పాదపూజచేయవచ్చును. ఇట్టి స్వాములవారు మఱల దొరకరు. వారెన్నో దినాలిక్కడ నుండరు.

పురుషుడు—(ప్రవేశించి) ఇవిగో నగలు. సుబ్బమ్మగారు.

1 అమ్మ—ఇవిగోనమ్మా నగలు.

ఒకడు—మా దొక పాదపూజ.

1 అమ్మ—మాకు జ్యోతిర్దర్శనం.

నూరమ్మ—మాకు భగవద్దర్శనం. ఇవిగో 200 రూపాయలు.

ఒకడు—మమ్మల్ని గురుబిడ్డల్ని చేయండి సుబ్బమ్మగారు.

సుబ్బమ్మ—(సాష్టాంగ నమస్కారముచేసి లేచి) అందరు నమస్కారముచేయండి. చేసి ఇండ్లకుపోయి రేపు దయచేయండి. వారు నిష్ఠలో కూర్చుందురు. పూజనైనదని సంకోచము వలదు. మీరిచ్చిన నగలు పూజలో చేర్పించెదను.

(అందరు నమస్కరింతురు)

(తె ర ప డు ను) (తెరముందు)

(ప్రవేశము) సూరమ్మ—అయ్యో! నాకొంప పోయిందో! నా నాలుగువందల రూపాయలు స్వాములవారి పాలపెడితినో! శంకరాచార్యులగారు మాగిరి బంగారపు వృశికాయలు కురిపిస్తానన్నాడో! సుబ్బమ్మ మాయలో పడిపోయినానో! ఈమాయ ముండాకొడుకు నాకెక్కడ దాపరించాడో!

(సుబ్బమ్మ ప్రవేశించును)

సూరమ్మ—సుబ్బమ్మ తల్లీ నాకొంప తీసేస్తివే! పిల్లపెండ్లి చేసుకొందామును కొన్నానే!

సుబ్బమ్మ—సూరమ్మా! నేనుకూడ ఏ స్వామిని నమ్మేదాన్ని కాను. వీడి మాయలో పడ్డానే! - వచ్చిన దాంట్లో భాగమిస్తానంటే డబ్బుకక్కుర్తిపడి, అన్నివిధాల చెడిపోయినానే - నన్నుకూడ టోపీలో పడవేసినాడే - అందరు వచ్చి మాయింటిమీద పడ్డారే! నన్ను కాస్తదాచవే సూరమ్మ - వీళ్లు చంపేటట్లున్నారే!

1 పురు—(ప్రవేశించి) స్వాములవారిని ఖయిదులో పెట్టారు.

సూ—నగలు దొరకినవా ఫుల్లయ్యా!

1 పురు—కొరడా దెబ్బలుకొట్టే సరికి, నగలు పారేసిన జాగా చెప్పాడు - పోలీసులు తెప్పిస్తున్నారు.

సుబ్బ—చల్లనిమాట చెప్పావు. సూరమ్మా! రాపోవుదము.

(సురేశ్ నరేంద్రులు ప్రవేశింతురు)

నరేం—అయ్యా! భగవంతుని చూపించగల స్వాములవారు వచ్చి యున్నారట - ఎచ్చట నున్నారో చెప్పగలవా!-

1 పురు—అయ్యా! స్వాములవారు వచ్చి లక్ష్మీపూజంటూ చేసి, నగలన్నీ దోచుకొని పోయిరి. ఇప్పుడు పోలీసులు వారిని పట్టుకొన్నారు. దేవుణ్ణి చూపిస్తానని వందలకు వందలు పట్టుకుపోయారు దేవుడులేడు దయ్యములేదు.

సురే—ఔర! కాలమహిమ! నరేంద్రా! స్వాములను నమ్మే కాలము కాదుసుమా! మఠమునకనో, పాదపూజకనో, పాదకాలకనో, దేశోద్ధరణకనో, నెపము పెట్టుకొనివచ్చి ప్రజలను మోసముచేసి పోవుచున్నారు. ఇదే వాళ్లకు వృత్తియైనది శిష్యులకు కమీషనిచ్చి ధనమున్న శిష్యురాండ్రను చేర్చుకొనుచు దేవుణ్ణి చూచినట్లుగా నటింపుచు కొంపలు దీయుచున్నారు! వీళ్ళనుగూర్చి ప్రభుత్వం శాసనం చేస్తే బాగుండును.

నరేం—అందఱు నట్లుండురా?

సురే—అట్లుకాదోయి! పెద్దపేరు, పెద్దమఠము ఉన్నదంటే పెద్దదొంగనన్నమాట.

నరేం——మనము వచ్చినపని కాలేదుగద.

సురే——ఆ వీధిని ప్రచండ శాస్త్రుల్లుగారు పురాణము చెప్పు. చున్నారట, వారు దేవుని చూచినారేమో కనుగొందము పద.

నరే——తప్పకుండా పోవుదము రమ్ము.

(సురేశ్ - నరేన్ - నిష్క్రమింతురు.)

(సుబ్బమ్మ సూరమ్మ — ప్రవేశింతురు.)

సుబ్బమ్మ——సూరమ్మా! మంచిశాస్త్రుల్లుగార్ని చూచుకొని మనము ఉపదేశం కావలెనమ్మా - పాములలోనైనా మెలగవచ్చునుగాని స్వాములలో మెలగలేమమ్మా.

సూరమ్మ——కాదే! మంచి ఆచార్యులుగార్ని చూచుకొని ఉపదేశం చేసుకోవాలని ఉందే - పద వెళదాం.

(నిష్క్రమింతురు - తెరయెత్తబడును.)

## రంగము 10

ప్రచండశాస్త్రిగారు పురాణకాలక్షేపము చేయుచుందురు

(రంగాచార్యులుగా రర్థము చెప్పుచుందురు)

కొందఱు కూర్చుందురు - కొందఱు వచ్చుచుందురు

ప్రచండ——శ. మఱలుపు మనియెదు కర్తయు

మఱలించెదు గోపకులను మఱలెడి క్రేవుల్

రంగా——ఆ ప్రకారముగ బ్రహ్మదేవుని మోసకృత్య మెఱిం గినవాడై శ్రీకృష్ణపరమాత్మ అఘటన ఘటనా సమర్థుడు గావున తక్షణమే గోవులను గోపకులను సృష్టించి నటువంటి

వాడై తానే కర్తయై నడుపుచు ...... (కృష్ణా కృష్ణా యని పడును. అందరు సేవచేయుదురు! లేచును)

వినేవాళ్లు—ఆచార్యుల వారికి కృష్ణ సాక్షాత్కారమైనది. ఇదంతయు, భక్తుడని మనమనుకొని శిష్యులుగా చేరుదుమని పన్నిన యెత్తుసుమా.

పరిచండ—ఆచార్యులవారూ! ఇక్కడ కృష్ణుడు సృష్టించుట కాదు అంతయు తానే అయినట్లు రూపకల్పన జేసెను.

వినేవాళ్ళు—శాస్త్రులుగారికి అద్వైతవాసన, ఆచార్యులవారికి ద్వైతవాసన.

పరిచండ—అపరోక్ష సాక్షాత్కారమే కాదటండీ ఉపనిషత్తులు భాగవతము ఘోషిస్తున్నది.

రంగా—శ్రీకృష్ణ పరమాత్మ విభవావతారమై.

(సుబ్బమ్మ - సూరమ్మ ప్రవేశింతురు)

సు—శాస్త్రిలవారిక్కి కుండనాలు చేయించి యిచ్చింది నీవే కాదటే సూరమ్మా.

సూ—నా మొఖం! ఆయనకు ప్రీతియున్నది. ముట్టినది. ఆచార్యుల వారికికూడ 50 రూపాయల సొమ్ము ముట్టింది.

సు—ఆచార్యులవారిక్కి ఉంగరం చేయించి యిచ్చిందికూడా నీవేనా! ఎంతబాగుందే ఉంగరం తళుక్కు మంటూ.

సూ—ఊరకే యిచ్చామేమిటి! చక్రాంకితాలు చేయించుకొని యిచ్చాం, శాస్త్రిలుగారిక్కి ఉపదేశం చేయించుకొని యిచ్చాను.

సు—ఇదేం మతమే - అద్వైతులదగ్గఱ ఉపదేశము ద్వైతుల దగ్గఱ చక్రాంకితములు.

సూ—ఆచార్యులవారు దేని కదే నన్నారు. శాస్త్రిలుగారు కూడ ఫర్వాలేదన్నారు.

రంగా—సూరమ్మా! కృష్ణపరమాత్ముని చూడని కన్ను లెందులకు!

సూ—తమ కటాక్షం వలన దాసురాలు గూడ......

సు—ఎప్పుడే—ఎప్పుడే?

ప్ర.చండ—పురాణం జరగనీయండి - తరువాత చెప్పకోవచ్చు- మధ్య మధ్య మాట్లాడకండి. గురుబిడ్డలే మాట్లాడుచుంటే తక్కినవారి మాట చెప్పవలయునా?

(నరేంద్రుడు సురేశ్ ప్రవేశించి కూర్చుందురు)

రంగా—అంత శ్రీకృష్ణపరమాత్మ అందఱను నిర్మించి నటువంటివాడై - "కృష్ణా, కృష్ణా" యని పడును.)

వినేవాళ్లు—హారతి ఈయండి - ఆచార్యులవారు - పడ్డారు.

(హారతి తరువాత - ఆచార్యులవారు లేచి కూర్చుందురు)

నరేం—మిత్రమా! మనము వచ్చిన పని తీర్చుకొనుట మంచిది.

సురే—శాస్త్రిలవారు! మా స్నేహితు డొక విషయమడుగ వచ్చునా?

రంగా—ఒకటి గాదు సందేహాలన్నీ తీర్చుకోవచ్చు.

నరేం—శాస్త్రిలవారు తమ రెంతవఱకు చదువుకొన్నారు.

ప్ర.చండ—నాకేమిటి-ఆచార్యులవారికేమిటి - మాయిర్వురకు భాష్యశాంతి అయింది - చిత్తశాంతి అయింది.

సూ—వారి కైలా - పరివ్రాజకంలో ఉన్నారు.

నరేం—తమరిస్వరకుగాని, లేదా ఒకరికి గాని భగవత్ సాక్షాత్కారమైనదా?

సూ—వారు చూడక పోవటం యేమిటి!

ప్ర.చండ— }
రంగా— } నిజ శిష్యులై నిశ్చేష్టులగుదురు.

సూ—గురువుగారు! చెప్పండి చూచామని. భయపడతారెందుకు?

రంగా—(నెమ్మదిగా) సూరి సూర్యా! చూపించుమంటే తంటా గాదూ?

సూ—(తెల్లపోవును.)

(నరేంద్రుడు - సురేశ్ ముందుకు నడచును.) తెరపడును -

నరేం—మిత్రమా! వచ్చినపని యైనది. నా ఆశాలత కాలవాలము దొరకునట్లు కన్పించుటలేదు.

గీ. సృష్టిలోపల నొక్కడు నేని లేడా!
పరమపురుషుని చూచిన పండితుండు!
భక్తులందైన నను, మఠాధిపతులయందు
నైన పేర్గన్న గురువులయందు నైన!

సురే—మఠాధిపతులను కలసికొందువుగాని రమ్ము. చూపించెదను.

గీ. ఎందఱో మఠాధిపతులు నింకెందఱేని
గలరు పీఠాధిపతులు లోకమ్ము నిండు
పోయినచో వెదకుదము సల్మూలాలందు
పట్టుదల లేక కార్యసాఫల్య మగునె!

నరేం——ఎవరువారు! గొప్పవారేనా?

సురే——నే సతింగినవారిపేర్లు చెప్పుదును వినుము-— అనిత్యానంద స్వాములవారొకరు; శుద్ధప్రణవానంద స్వాములవారొకరు; చిత్ చిత్ ఆనంద గగనస్వరూపానందస్వాములవారొకరు; అరవస్వాము లొకరు; తస్కరానందస్వాములవారొకరు; ఆడ మళయాళస్వాములవారు. అందరు ఉద్దండులలాగే కబుర్లు చెప్తారు. ఎప్పుడూ వారివెంట పదిమంది ఉంటారు.

నరేం——నరే పోవుదముపద - నిష్క్రమింతురు.

(ఒకవైపునుండి సుబ్బమ్మ - సూరమ్మ ప్రవేశింతురు.)

సూ——సుబ్బమ్మా! పాములలోనైనా ఉండవచ్చునుగాని స్వాములలో మెలగలేమే!

సు——ఏమే! అలాఅంటావు?

సూరమ్మ——పరబ్రహ్మానందస్వామి, ప్రచండశాస్త్రిలు, రంగాచార్యులు, వీరి బండారాలు బయటపడ్డతరువాత అనిత్యానందస్వాములవారిని ఆశ్రయించితినే.

సు——నీ అదృష్టం. ఎప్పుడూ స్వాములతో సాంగత్యమే నీకు!

సూ——ఈ లోకంఅంతా అనిత్యంఅని చెప్తూనే నా దగ్గఱ 400 రూపాయలు లాగివేసినాడే! ఇప్పుడు త్తచేతులతో పోతే పలకరించడుకూడాను. తరువాత శుద్ధప్రణవానంద స్వామిదగ్గఱ చేరానే!

సు——ఆయన జ్ఞానోపదేశం బాగా చేస్తారటకదూ!

సూ—ఏం బాగూ, బండలు- వెళ్ళినకాణ్ణుంచి మళంఅంటాడు. ఫలహారాలంటాడు. పోనీకదా అని 4000 రూపాయలు ముట్టచెప్పానే! ఇంకా వాడిమొహంలో సంతృప్తికనపడదు.

సు—పోనీ గృహస్థులకుడబ్బుకాని వీళ్లకుడబ్బెందుకే సుబ్బమ్మా.

సూ—మనకోసమే. మన్ని వుద్ధరించేందుకే సగం. తక్కింది వాళ్ళ సుఖంకోసం అయినా సూరమ్మా! రెం దుపన్యాసాలు చెప్పగానే విని మనల్ని విమానం ఎక్కిస్తారని నమ్ముతాం. మొన్న తస్కరానందస్వామి ఏం చేసాడో చూసావూ! బిక్షకని ఇంటికిపిలిస్తే భేదభావంపోవాలని మావదినెమీద చేయివేసాడుటే! ఏడిజ్ఞానం ఎలాఉందో చూశావూ! నల్గురు మొగాళ్ళకు తెలిసి తన్ని పంపించారు.

సు—ఏమి స్వాములే. అసహ్యముపుడుతుంది. గృహస్థులు చాపలమీద - స్వాములు హంసతూలికాతల్పములమీద - గృహస్థులకు గంజి, స్వాములకు సేమ్యాపాయసాలు - గృహస్థు కాలినడక, స్వాములకు మోటారుకార్లు- గృహస్థు 1—0—0 గుడ్డ, స్వామికి 20 రూ॥ ఖాడీ! మనంతట మనం పుస్తకం చదువుకుంటే అన్నీ తెలుస్తాయి. సూరమ్మా! నువ్వు ఎంతమంది గురువులకో పాదపూజ చేసిలివిగద - ఒకనిదగ్గఅన్నై నా గురులక్షణము లున్నవటే!

సూ—ఆ ముక్క వాళ్ళనడిగితే కొండంత కోపం - సముద్రం అంత తాపం - ఇంకో చిత్రముందే! స్వాములలో స్వాములకే అసూయలు, ద్వేషాలు. ఒకరిశిష్యుల్ని ఒకరు తమ

దగ్గరకు రప్పించుకోవడం - అందులకే స్వాములకు గడవక ఉపదేశాలకు రేట్లుకూడా పెట్టారు.

సు—రేట్లమాట వినలేదే! ఎలాపెట్టారు?

సూ—పావలాయిస్తే పరిపూర్ణం చెపుతారు. అణాయిస్తే అచలం చెపుతారు. చెప్పితే నువ్వు నమ్ముతావో నమ్మవో - ఈమధ్య అరవస్వాములవారు వచ్చి అరకప్పుకాఫీకి అచలబోధ చేసి వెళ్లారు. స్వాములకు, మొగాళ్లలో, కానీ యిచ్చేవాళ్లు లేక, ఆడవాళ్లనే శిష్యురాండ్రుగా చేర్చుకొనుచున్నారు. వంటకు, సేవకు అన్నింటికీ పనికి వస్తూ డబ్బుకూడా యిస్తామని. ఈమధ్య ఒకస్వాములారు పెళ్లాన్ని చూడంది ఉండలేక పోయ్యేవాడు. ఇదంతా సుబ్బమ్మ! స్వాములంటే ఆమాడదూరములో వుంటున్నానమ్మా!

సు—ఏదైనా అనుభవం మీదగాని తెలయదు మరి, - అన్నీ అచ్చుపుస్తకాల్లో ఉన్నాయిగాదూ!

సూ—ఆడమళయాళ స్వాములవారిని చూచావుటే!

సు—లేదమ్మా! అయసలో విశేషమేముంది?

సూ—చూస్తే తెలుస్తుంది.

సు—నీకు నచ్చాడుటే! నీకు ఒకమాత్రం వాడు నచ్చడుగా.

సూ—భక్తియున్నవాళ్లకు వైరాగ్యం బోధచేస్తారు. ఈ రెండూ వున్నవాళ్లకు జ్ఞానబోధచేస్తారు. ఈమూడు వున్న వాళ్లకు తత్త్వబోధ చేస్తారు. ఈ నాలుగూ వున్న అర్హత గలవారికి దేవుణ్ణి చూపిస్తారు. నీకు తోచినంత యిచ్చు

కుంటే చాలును. పాదపూజ చేసి గురువుగా నొప్పుకోవాలి మరి. లక్ష్మమ్మ అదృష్టం చూశావుటే? కొడుకుల్లేకపోతే మోక్షం లేదని చెప్పి, గురువు కొడుకును కూడ కనిపెంచాడే!

సు:—ఏంచేస్తుంది. మొగుడు 70 ఏళ్ళవాడు?

సూ:—ఐహికం, ఆముష్మికం రెండూ యిస్తున్నారే - గురువులు!

సు—స్వామిఅన్నవాడిదగ్గర తలవంచనని ఒట్టుపెట్టుకున్నాను

సూ—అన్నిచోట్లా అలావుంటే ఎలామరి! రేపు స్వాముల వారికి పాదపూజ జరుగుతుంది చూద్దుగానిరా. ఆ సమయములో వారు ఈ లోకములో ఉన్నట్లు కనబడరే!

సు—ఆ సమయములో సూదిపుచ్చుకొని గుచ్చితే.

సూ—తప్పుకాదుటే!

సు—గుచ్చినా తెలియదే! అదేగా సమాధిలో వుండటము. ఇంతవర కెవరూ అలాగుచ్చి పరీక్షచేయలేదు నీవు సాహసము చెయ్యాలి - పోదాంరా - పొద్దుపోయింది.

(నిష్క్రమింతురు.)

(నరేంద్రుడు - సురేశ్ ప్రవేశింతురు)

సురే—సురేంద్రా! స్వాములందరును "దేవుని చూచితిరా" అనిన వెంటనే నిర్విణ్ణులై పోవుచున్నారోయీ.

నరేం — అనిత్యానందస్వామి, శుద్ధప్రణాహానందస్వామి, అవర రాజరాజేశ్వరీస్వామి, తన్కరానందస్వామి, బ్రహ్మానంద గిరిస్వామి, ఒకరా, ఇద్దరా పదిమంది మొదలు వెయ్యిమంది శిష్యులవరకు బోధచేస్తున్న స్వాములను చూచితిమి గద.

సీ. మఠమున్న స్వామిని, హఠమున్న స్వామిని
మేడలుగలస్వామి, మిద్దెస్వామి
పొట్టిస్వామిని, మరిపొడుగైన స్వామిని
నడ్డమ్ము పెరిగినయట్టి స్వామి
మగశిష్యులున్నట్టి, మరియు స్త్రీ శిష్యురాం
డ్రున్న స్వాములగాంచి యుండలేద
కాషాయ శాటీలు గట్టిన ప్రీతిస్వామి
దండంబు ధరియించు దండిస్వామి

గీ. లలితముగ మహావాక్యముల్ తెలియునటుల
బోధలను జేయుచున్నట్టి పూర్ణబోధ
స్వాములంగూడ నడిగి వేసారినాడ
దైవమును చూచితి నటన్న ధన్యుడేడి?

సురేశ్ — నీ వడిగిన స్వాములందరును ఇడ్లీ, కాఫీ స్వాములు, సాంబారు స్వాములు, గారెల స్వాములు, తైరువడ స్వాములును, వారు నిత్యమును చూచేది శిష్యుల ముడువులు — ఒక్క మహనీయుని మాత్రము చూడవలసి యున్నది.

వారే ! ఆడమళయాళస్వాములు. అంతటితో నీ పిచ్చియు తీరిపోవును

నరేం——నరే పోయివచ్చెదము. (నిష్క్రమింతురు.)

(తెరమూతబడును)

## రంగము 11

(ఆడమళయాళ స్వాములవారు పూజాపీఠముపైనుందురు-క్రొత్త వస్త్రమునుగప్పి శిష్యులు, శిష్యురాండ్రు హారతులిస్తూ - పాదపూజలు చేస్తూ పాదతీర్థం పుచ్చుకొని - అష్టోత్తరం చెబుతూవుంటారు. కొందరు కూర్చుందురు.)

సు——సూరమ్మా! చూడవే! వారు సమాధిలోకి వెడుతున్నారు.

సూ——కాదే! ఒకకన్ను తెరిచీ తెరవ నట్లున్నది చూడు. పాదపూజలో పెట్టే డబ్బు, శిష్యులు కొట్టివేస్తారేమో నని అరకంట చూస్తున్నారే! సమాధి కాదే!

సు——తప్పు. అలా అనకు - ఇప్పుడు వారు యిక్కడ లేరు.

సూ——నేను పూవులు పాదములపై వేస్తున్నట్లుగా నటించి, సూదిపెట్టి పరీక్షించి గుచ్చుతాను. ఒళ్లు తెలిసింది, లేంది, తెలుస్తుంది - ఇదంతా మోసమే, సుబ్బమ్మ తల్లీ.

(నరేంద్రుడు, సురేంద్రుడు, ప్రవేశం)

నరేంద్రుడు—— సురేంద్రా! మంచి స్థానమునకే వచ్చితిని.

(శిష్యులు మంత్రపుష్పమును చెప్పుచుందురు)

1 శి——అందరు నిశ్శబ్దముగా నుండుడు. గురువుగారిప్పుడు భగ

వంతునిపై మనస్సు లగ్నముచేసి ప్రపంచమును మరచి యున్నారు.

సూరమ్మ—(చల్లగా సూదితో గుచ్చును.)

ఆ. సా—(ఉలికి పడి ప్రక్కకు చూచుకొనును.)

సూ—(సుబ్బమ్మ నవ్వుదురు.)

నరేం—అయ్యా! తమరు దేవుని చూచియున్నారా?

ఆ. సా—(నిర్విణ్ణు డగును.)

(శిష్యులు ఒకరిమొగము ఒకరు చూచుకొందురు.)

నరేం—ఈ దొంగవేసము లెందుకు? శిష్యులను మోసము చేయుటెందులకు? కష్టపడి చెమట ఓడ్చి, కూలివని చేసి సంపాదించుక బ్రతుకరాదు? ఇంతమంది శిష్యుల, అమాయకుల ధనమును కొల్లగొట్టుచుంటివే! ఇంతమంది శిష్యులు పాదపూజచేయుటా! వారికన్న గొప్పదనమేమి? నీ దగ్గర గురువులక్షణము లున్నవా? ఎందరు శిష్యులను పరీక్షించినావు? ఎందరు శిష్యులు నిన్ను పరీక్షించినారు? వచ్చిన వారికి స్నేహితునివలె నాల్గు మంచి మాటలు చెప్పిన చాలదా? నీకు తెలిసినది చెప్పిన చాలదా? ఈ ఆడంబర మంతయు మోక్షమునకేనా? ఒక్కనికి జ్ఞానబోధ చేసిన నీ జన్మ ధన్యముగాదా! ప్లీడరుదగ్గఱ పార్టీలవలె, నీ ఆంబాట మేమి? శంకరాచార్యుల కెందరు శిష్యులున్నారు? శంకర సాంప్రదాయమని గుండెలు కొట్టుకొందురే! నీ శిష్యుల యెదుట నే నిట్లు మాట్లాడుట నీకు కష్టముగనే యుండును. తలవంపుగనే యుండును. నీవంటి ఒక్క సన్న్యాసియైనను

అదర్శకముగ నుండిన ఇప్పటికి వేలకువేలు బాగుపడి యుందురే!

నరేం—సురేంద్రా! మనము వచ్చిన పని కాలేదు! ఈ విమర్శనము మన కెందులకు! ఎవరిపొట్టతిప్పలు వారివి. పోదము పద.

(నరేంద్రుడు, సురేంద్రుడు, ముందునకు వత్తురు)

(తెరపడును)

నరేం—అట్లడుగుట మంచిపని కాదని నాకు తోచును. మనమే పనికై వచ్చితిమో అది చూచుక పోవలయును. ఒకరికి బోధించుటకు మన కర్తవ్యతే మేమున్నది.

సు—అదేమోకాని శిష్యులకన్న గురువులు, గురువులకన్న శిష్యులు ఎక్కువై పోతున్నారోయి! గురువులను గూర్చి, మతాలనుగూర్చి గవర్నమెంటువారు శాసనం చేస్తే బాగుంటుందోయి!

నరేం—అదంతయును మనకెందుకుగాని మహాసీయులలో పేర్గాంచిన ఒక్కడైనను దేవుని చూచితినని చెప్పలే నపుడు దైవమున్నాడో, లేడో యను సందేహము ప్రబలమగుటకు సందేహమేమి! ఆ యా మతములలో గల గ్రంథములను చూచితివిగద. మతములు దేవు డున్నాడనియే చెప్పుచున్నవి. వీరందరు సాధనలు చేయనివారేనా! వ్యర్థముగా జీవితమును గడపి కేవలము ధనార్జనాపరులై, కీర్తికాములై, సుఖజీవనాపేక్షులై, వీరందరు భూమికి

బరువగుచుండెరా? సృష్టిక్రమము చూచినచో, సృష్టి విలాసము చూచినచో, దీనినంతయు సక్రమముగా నడిపించువాఁ డొక డుండియే తీరవలయు నని తోఁచకమానదు.

సీ॥ మాతృగర్భముఁజొచ్చి మఱి మూత్రముల మధ్య
మనియుండ గోరునా? మానవుండు!
ఏదైవమో శక్తియో దరిజేరి క
డింది బలమున నెట్టినను గాక!
పుత్ర మిత్ర కళత్రములు నీ శరీరము
విడి చేస గోరునా వృద్ధుడైన!
ఏదైవమో, శక్తియో దరిజేరి క
ఠింది పాశమున నీడ్చినను గాక!
గీ॥ అట్టివాడెందు నున్నాడో? అట్టి శక్తి
యేదో? చూచినవార లెందెందుగలరో!
చూచుటకు మార్గమే లేదో? చూడరాదో?
వాని లీల లెఱుంగ నెవ్వానికౌనో?

ను—నరేంద్రా! నీవు నిరాశపడవలసిన పనిలేదు. ఒక విషయము జ్ఞాపకమునకు వచ్చినది. నీవును జ్ఞాపకము చేసుకొనుము. మొన్న మన ఇంగ్లీషుపాఠము చెప్పుటకు వచ్చిన కాలేజి ప్రిన్సిపాల్, దేవుని జూచిన మహనీయుడు, దక్షిణేశ్వరాలయములో నున్నాడని చెప్పలేదా?

శె—అవునవును. పేరు కూడ చెప్పినారోయి!

న—ఔను! ఔను! రామకృష్ణ పరమహంస యని వారి పేరు చెప్పిరి.

సు—ఇంకేమి? అక్కడకుఁ బోవుదము.

న—అతఁడు పిచ్చివాఁడని ప్రజలు చెప్పుకొనుట వినలేదా?

గీ॥ అతని చూపులుఁ బల్కులు, నతని నడక,
లతని చేష్టలు, పద్ధతు, లతని వస్త్ర
ధారణము, విహారము లసాధారణము ల
టంట! పిచ్చివాడని ప్రజలాడ వింటి!
అతడు మనకెట్లు సహకారి కా గలండు?

సు—చూడనిదే మన మే అభిప్రాయమును స్థిరపరచుకొన రాదు.

న—నీవు పల్కినది యథార్థమే!

గీ॥ చూడకయె కొందరుఁ మాటలాడబోక
కొందరుఁ వినకయె మరికొందరుఁ ప్ర
జల్, ధరిత్రిపై వార్తలన్ జాటుచుందుర్!
ఎపుడు ప్రత్యక్షముగ గ్రహియింప మేలు!

సు—వారి దర్శనము తప్పక చేయవలసినదే, అతను మహా నీయుడు గానిదే మన ప్రిస్సాలు పలుకునా?

న— పోవుదము రమ్ము.

(నిష్క్రమింతురు.)

## రంగము 12

శ్రీరామకృష్ణుడు, శారద, కాళీమాయికి పూజచేయుచుందురు.

(సురేంద్రుడు, నరేంద్రుడు, ప్రవేశింతురు.)

శ్రీరామ—చాపమీాద కూర్చుండుడు. మీాలో నెవరైనను పాడగలరా?

సురే— మా నరేంద్రుడు చాలా చక్కఁగా పాడఁగలఁడు.

శ్రీరా— మీరందరు కలకత్తానుండియే వచ్చి యున్నారు గద; ఏదీ ఆ పిల్లవానిని పాడు మను, విందము.

నరే—

మ. మనసా! నీజననస్థలం బిచట! సామ్రాజ్యంబు పాలించు, రే
నినిగానీ; పలుచోట్ల ద్రిప్పెదవు; నీ నిర్భాగ్యతన్ చూచినం
తన దాక్షిణ్యము కల్గు! పుట్టినయెడన్ దత్స్వార్థ సంపత్తి నిం
డిన యట్లుండును. సౌమ్య! నీ వచట కే నిర్భీతిమై చిత్తమా!

రా—(స్వగతము) ఓహో! ఎట్టి ఆనందమయ వాక్యములు నాకర్ణంబుల బడియె. ఇట్టి సుధామయంబులగు పల్కులెవ్వరైన యిన్నినాళ్ళుగా నా చెవిఁ బడవేసిరా? ఈబాలుండు సిద్ధుండని తోచుచున్నది. (ధ్యానించి) తెలిసె; తెలిసె; ఈతండు సాక్షాత్ శంకరాంశ సంభూతుండు; మానవోద్ధారణార్థై వచ్చిన మహనీయుండుగాని, సామాన్యుండు గాడు; ఈతనిశక్తి నీత డెఱుంగని స్థితియం దున్నాడు. కానిమ్ము.

గీ. ఇతని చూచిన మాత్రాన నేమొ గాని
ఇతని వినినంత మాత్రాన నేమొగాని
ప్రొద్దు తిరుగుడు పూవు సూర్యునకు నెట్లొ
అటులె నా చిత్త మీతని యందె తిరుగు.

(నరేంద్రుని చేయిపట్టుకొని ప్రక్కవసారాలోనికి పోయి లోపల తలుపు బంధించి.)

నాయనా! ఎన్నాళ్ళ కరుదెంచితివి! ఇంత ఆలస్యముగ వచ్చితివేల? నీకై ఎంత తపించుచుంటినో ఆ కాళికాదేవికే

తెలియువలయు. నా పరితాపము నెఱింగించిన నమ్మువా? ప్రాపంచిక మనుష్యులరుదెంచి అనేక లౌకిక విషయములు ప్రసంగించి, నా చెవులను మైల నొనర్చుచున్నారు. నేటికి నీ వరుదెంచి కర్ణ రసాయనంబులును, సుధామయంబులును, అజ్ఞానాంధకార ధిక్కారణంబులును, జ్ఞానోద్దీపనకరంబులును నగు మహావాక్యంబులు, నా చెవులం బడవైచి, శ్రవణంబులకు తేజం బొసంగితివి. ఆహా! ఈ దినమే సుదినము! నా ఆధ్యాత్మికానుభవము నెవడు గుర్తింపగలడు. నే సంపాదించిన యోగధనంబు యోగ్యునికి కాదా అర్పించవలయు? దాని విలువ గ్రహించిన వాడును దాని అవసరమున్న వాడును గద కావలయును? నీ కంటె అద్దాని భరించుటకు మఱెవ్వరికి శక్తి గలదు! విష్ణు పాదోద్భవి గంగను భరింప శివునికిగాక నెవ్వరికి సాధ్యమయ్యె.

(లోపలకు పోవును)

నరేం—(స్వ) నన్ను చూచినకొలంది సీతనికి పిచ్చి హెచ్చగు చున్నదే! ఒక ప్లీడరు కుమారుడ నగు నన్ను, సామాన్యుడగు విద్యార్థినగునన్ను, ఇంత గొప్పదనము చేయుచున్నాడే! ఈతడు పిచ్చివాడని ప్రజ లిదివఱకే చెప్పుకొనుచున్నారు? నేడు యథార్థముగా సీతని ప్రవర్తన వలన నెఱింగితిని.

గీ. జనులలోపల పిచ్చివా డను వరంతి
పిచ్చివా రెవ్వరో ముడివేసిరంచు
తలచితిని గాని యీతని పలుకుచూడ
నది యథార్థ మటంచు ప్రత్యక్షమయ్యె.

(రామకృష్ణుడు మిఠాయి పండ్లు తెచ్చును.)

రా—నాయనా! ఇదిగో ఈ పండ్లు తినుము. ఇదిగో మిఠాయి.

న—నా స్నేహితులు నేను తరువాత తిందుము.

రా—అట్లుగాదు, నీవు ముందుగా తినవలయును. (నోటిలో కుక్కును.)

న—ఇదేమయ్యా! నీ పిచ్చి కంతము లేకున్నదే!

రా—మా నాయనా! తినుము. బ్రతిమాలుచున్నాను.

న—గీ. ఎందఱెందరినేని వీక్షించి యుంటి
నిన్నుబోలినవానిని నే నెఱుంగ
నీదు చేష్టల కతమున నేడునన్ను,
గూడ పిచ్చివానిగ జేయ గోరినావె!

(స్వ) అబ్బా! ఈపండ్లు మిఠాయి, తినకున్నచో నన్నితడు వదలునట్లు కన్పించదు. (తినును)

రా—సంతోషము! సంతోషము! నాయనా సరే. కాని అబ్బాయీ! ప్రతి రోజు నీవు నిద్రించుటకు ముందు ఒక వెలుగును దర్శింతువా?

నరేం—(ఆశ్చర్యముతో) అవును దర్శింపుచుంటిని. ఈ విషయము మీకెట్లు తెలియును? నే నెవ్వరికి ఎన్నడు, కడకు నా తల్లిదండ్రులకు గూడ చెప్పియుండలేదే.

(స్వగతము)

ఉ. లోకులు కాకులంచు బుధలోకము వాకొను మాట సత్యమే
లోకులు పిచ్చివాడని విలోకన చేసిరి పిచ్చిచేత, నా
లోకన సేయజాలును త్రిలోకములం గల వార్తలెల్ల సు
శ్లోకుడితండు నాకొఱకె సూ!యిటువచ్చెనటంచు దోచెడిన్.

ఏమను ఈతడు జోగియైనను, యోగియైనను, పిచ్చి వాడైనను నాకేమి? నేను వచ్చిన పని తీర్చుకొనవలయును. అయ్యా! మీరు భగవంతుని దర్శించియున్నారా?

రా—ఆ, దర్శించితిని. దర్శింపుచున్నాను. నిన్నెట్లు చూచు చున్నానో, ప్రత్యక్షముగ నట్లే నాయనను దర్శింపు చుంటిని.

నరేం—ఆ! ఆ! ఆ! ఎవ్వరి నోటను వినని పల్కులను విను చుంటినే!

రా—ఆయనతో మాట్లాడవచ్చును; నీతో నెట్లు మాట్లాడు చున్నానో, అట్లే!

నరేం—ఆయన బదులు ప్రత్యుత్తరము నిచ్చునా?

రా—ఇచ్చును; ఆయనయు పలుకును, చూచును, ఆదరించును.

నరేం—పలుకునా? ఆయనకు నోరున్నదా? చూచునా! ఆయ నకు కన్నులున్నవా? అట్లైన ఆయన కాకార మున్నదా? బ్రహ్మమందిరములో నాయనకు రూపము లేదను చున్నారే? వారేమి తెలియనివారా?

రా—అయినను, నాయనా! ఆయనను చూడవలె నను జిజ్ఞాస ఎవ్వరికి గలదు?

సీ. భార్య చచ్చిన వలవలనేడ్చి కొంప ము
ణిగినటు గార్చెదరు కన్నీటిధార!
ఐశ్వర్యమెల్ల పూజ్యంబైనయపుడె కుంగి
గిపడి గార్చెదరు కన్నీటిధార!

ఉన్న గౌరవమెల్ల నూడిన చోటునో
మాటకో గార్చెదరు కన్నీటిధార!
బిడ్డలుపోయినఁ విలపించి, నింగి క్రుం
గినటు గార్చెదరు కన్నీటిధార!
గీ. ఔర! ఉద్యోగమూడిన యంతలోన
తిరిగి తిరిగి యేడ్చెదరు రాత్రిం బవళ్ళు
దైవ దర్శనమున కయి ధరణిలోన
వలవలఁ దుఃఖమొందు నెవ్వఁడు నరేంద్ర!

సీ. భగవంతు దర్శింపవచ్చునా? తీర్థ యా
త్రలకు వేలకువేలు ధారవోయ
భగవంతు దర్శింపవచ్చునా? జప తపం
బులను వేలకువేలు నలిపినంత
భగవంతు దర్శింపవచ్చునా? దాన ధ
ర్మములు వేలకు వేలు రహినొనర్ప
భగవంతు దర్శింపవచ్చునా? శిష్య సం
తతులు వేలకు వేలు తారసిలిన
గీ. గరళమటు లెంచి కామినీ కాంచనముల
చిత్తచలనం బడంచి శిక్షించి బుద్ధి
అతనికై తీవ్ర సందర్శనాభిలాష
కడవలకొలంది కన్నీళ్ళు కార్చనేని
అతఁడు దర్శన మీయరాఁడా! కుమార!

స—(స్వ) ఏమి! ఈతని వాక్యధ్వని! నా హృదయ గహ్వరమున
ప్రతిధ్వనించుచున్నదే! ఇంతవరకు భగవద్దర్శనమునకై

నేను గాని, నేను మహనీయు లనుకొన్నవారుగాని ఏమాత్రము తీవ్రప్రయత్నము చేసినట్లు గాన్పించుట లేదు. ఇవి పిచ్చివాని వాక్యములును గావు. పొట్టబోసికొను వేదాంతి వాక్యములును గావు. శాస్త్రములు తలక్రిందుగా చదివినవాని వాక్యములును గావు. అనుభవనీయుని జీవిత గ్రంథమునందలి సువర్ణాక్షరసంపుటములు. ముముక్షు జన సన్నిహిత బంధువులు.

ప్ర—(ఆర్యా)! కటాక్షించి నాకట్టి దర్శన మిప్పింపగలరా?

రామ—సందేహ మేమి? నీవు ఒంటరిగా ఇచ్చట నుండవలయును.

నరే—అట్లయిన నా స్నేహితులను పంపి వచ్చెదను.

(నిష్క్రమించును.)

రామ—

గీ. తగిన యధికారి లభియించె తల్లికృపను
ఇంతకంటెను భాగ్య మింకేమి గలదు?
ఇంతకంటెను భాగ్య మింకేమి వలయు?
అమ్మ తలచిన కాని దేదైన కలదె?

నరే—(ప్రవేశించును.)

రామ—నరేంద్రా! ఇటురమ్ము. నీకు నిజమైన భగవద్దర్శనాభిలాష గలదా?

నరే—లేకేమి? ఎందరెందరినో మహావిద్వాంసులను పండితులను, ఉపన్యాసకులను, పౌరాణికులను, శతావధానులను దేవీపూజాపరులను దర్శించితినిగాని ఈ విషయమై నన్ను

సంతృప్తి పరచినవారు ఒక్కరైనను కానరారైరి. నా అదృష్టవశమున మీరు లభించిరి.

రామ—అయితే నాయనా! భగవంతుని సాకార నిరాకార ములలో దేనియందు నీ కభిరుచి?

నరే—మహాత్మా! ఇంతవరకు నే నెవ్వరి సహాచర్య లాభమును పొందుచుంటినో అట్టి బ్రాహ్మసామాజికుల మందిరము నందు భగవంతుడు నిరాకారుడనియే వినియుంటిని.

గీ. అఖిల మతముల దివ్య సభాంతరముల
భూనభంబుల స్వర్లోక భూములందు
ఒకట నవ్యక్తమై వెలుగొందు శక్తి
కున్నదే ఒక్క ఆకార మో మహాత్మ.

భగవంతునికి ఆకార మున్నదనుటలో నా కే మాత్ర మును విశ్వాసము లేదు.

రామ—(స్వ) భగవంతుని సాకార విషయము ముందు ముం దాత డెఱుంగ గలడు. ప్రస్తుతము ఈతని మనోభావము లను బట్టి భగవంతుని నిరాకార తత్వము నిరూపించి భగ వంతుని యందు శ్రద్ధ గలిగించెదను. నరేంద్రా దగ్గరకు రమ్ము.

(నరేంద్రుడు కొంచెము దగ్గరకు వచ్చును.)

రామ—నరేంద్రా! ఇంకను సమీపమునకు రమ్ము.

(నరేంద్రుడు సమీపమునకు వచ్చును.)

రా—(నరేంద్రుని వక్షమును తాకును.) (నరేంద్రుడు భ్రమియించినవానివలె నుండును.)

నరేం—ఓ పిచ్చివాడా! నన్నేమి చేయుచున్నావయ్యా! యింటిదగ్గఱ మా అమ్మ, సోదరులు, బంధువులు గల రయ్యా! నాకు కూడ పిచ్చి పట్టించెదవా! (ఒడలు మఱచి యుండును.)

రా—(కొంతసేపటికి మఱల తాకును. నరేంద్రునకు స్పృహ వచ్చుచుండును.)

నరేం—(లేచి) ఎక్కడి దీప్రపంచము! నా ఆనందావస్థ భంగ పరచిన వారెవరు? క్షణముక్రింద నేను దక్క నింకెవ్వరును లేరే! ఓహో ఆనందము! మఱచుటకు వీలుగాకున్నదే! జీవితము నందెన్నడును మఱచుటకు వీలులేనిది. అయ్యా! నన్నెందుల కీ స్థితియందుంచితిరి? ఇతః పూర్వస్థితియే సుఖదాయకముగద!

రా—నాయనా! ఆనందమే భగవంతుడు. ఆ భగవదానంద మునే అనుభవించితివి. అదే నిరాకారము. అదే అద్వైత స్థితి.

నరేం—అట్లయిన నన్నట్లేయుంచక మఱల నీద్వైత ప్రపంచ ములోని కేల తెచ్చితిరి?

రా—నీ ప్రపంచ వాసనలు నశించలేదు. కావుననే అమ్మను సోదరులను స్మరించితివి. నీవాసనలు నీకు బంధములు కావు. అవి లోకశ్రేయస్సున కుపయోగించును.

నరేం—నాకాస్థితిలోనే యుండవలయునని యున్నది.

రా—అదే స్వార్థ మనిపించుకొనును. నే నట్లుండగలను. నే నట్లే యున్నచో నీకు లాభముండునా? నీవు నట్లేయున్నచో

నితరుల క్షేమ లాభము. నీకీ శరీరము లోకము నిమిత్తమై వచ్చెను. లోకమున కర్పించిన తరువాత ఆ స్థితిని పొందుదువు. నీ కూరక రుచి చూపించితి. అనేక సాధనలు చేసిన గాని, పొందరాని స్థితినుమా యది !

నరేం— మీ వాక్యములు, చర్యలు నాకు పూర్తిగా నర్థమగుటలేదు. ఇంటిదగ్గర మా అమ్మగారు నాయనగారు నా నిమిత్త మెదురు చూతురు. పోయి వచ్చెదను.

రా— నీ వచిరకాలములో రావలయును సుమా, నిన్ను చూడక నేనుండజాలను.

నరేం— అట్లే.

రా— తప్పక రావలయునుసుమా ! చేతిలో చేయి వేయుము.

నరేం— ఇదేమి పట్టుదల. నాకిష్టమున్నచో వచ్చెదను లేనిచో, రాను.

రా— అట్లుకాదు నాయనా, చేతిలో చేయి వేయనిచో నిన్ను వదలను.

నరేం— (స్వ) ఈ పిచ్చి పట్టుదలలు చూచినవుడెల్ల ఇతని గొప్ప దనంబును గూర్చి సందేహింప వలసి వచ్చును.

(ప్ర) అట్లే తప్పక వచ్చెదను. (చేతిలో చేయివేయును.) నే పోవుచున్నాను. (నిష్క్రమించును)

రా— బంధ సంబంధంబుః బడగొట్టు ధనము
అంధకారంబును హరియించు ధనము
నిత్య సంతోషంబు నెగడించు ధనము
సత్య సందేశంబు చాటించు ధనము

జన్మరాహిత్యంబు సల్పెడు ధనము
సన్మునీంద్రుల కొద్ద జానొందు ధనము
ధనమదం బణగించు ఘనమైన ధనము
తనుభావ మర్పించు తత్త్వైక ధనము
కుల మదం బణగించు గొప్పైన ధనము
కలి మదంబు హరించు జ్ఞానైక ధనము
కాళికాకృపచేత గల్గిన ధనము
మాలిన్య మణచు బ్రహ్మజ్ఞాన ధనము
ఎవని కర్పింతునా! ఎప్పు డర్పింతు
ఎవడు భరించునా! ఎట్లు భరించు
అనుచు రాత్రిం బవ ళ్ళంతరంగమున
వినుతింప వినుతింప విని విని దేవి
అన్నింట సర్వత్ర నలరారు వాని
క్రొన్నన ప్రాయంపు కొమరైన వాని
కరుణించి మా యమ్మ కబురంపి తెచ్చె
తరుణంబు దప్పక ధారపోసెదను
జన్మ ధన్యంబయ్యె సాఫల్య మయ్యె
జన్మ సార్థకమయ్యె జన్మఫలించె.

### రంగము 13.

(కలకత్తావీధిలో నరేంద్రుడు - జోడులేని కాళ్ళతో, బి. ఏ. సర్టిఫికేట్‌తో.)

ఔరా! కాలమహిమ! విద్యాభ్యాసమునకై మా

నాయనగారు నా నిమిత్తమై యెన్నివేలు ఖర్చుపెట్టిరో గాని, ఈ నా డందులకు వడ్డియైనను గిట్టుటలేదు. వడ్డీమాట యట్లుండ మూడుపూటలుగాదు, రెండుపూటలకు గంజికైనను సంపాదించ గల సామర్థ్యమేది? మానవజీవితమ్మునం దెన్ని మార్పులు గలుగుచుండును! నాయనగారు జీవించియున్నపుడు వారు నెలకు వేలకు వేలు సంపాదించినవుడు, నా వస్త్రంబు లెట్లుండెను! నా నడక లెట్లుండెను! నా దర్జా యెట్లుండెను? నే డెట్లుంటిని. ధనముయొక్క విలువ నేడుకదా ఎఱింగితిని!

శా. ఆ భోగంబులు, నావిలాసములు, నా యా రమ్యహర్మ్యప్రభా
సౌభాగ్యంబులు, వాహనాభ్యుదయ సంచారప్రకారమ్ములున్
భూభాగంబున నెవ్వరే ననుభవంబున్ నావలెన్ పొందిరి నా
రే? భుక్తిన్ గడియింప కష్టమిపుడయ్యెన్ కాలచిత్రంబహో!

పొట్టకూటికై ఎందరిని ఆశ్రయింప వలసి వచ్చినది, బైసినూలి ఆశ్రయించినను ఫలము లేకున్నది గదా. భారత దేశములో నా వంటి హూణవిద్యాపిశాచావేశితులైన యువకులు ఎందరు నిరుద్యోగ సముద్రమున నీదులాడుచు దరిద్ర దేవతకు అతిథులై యున్నారు. నే నొక్కడనైన ఛీ! నా కింత చింతయుండదు, నల్గురైదుగురు నా సంపాదనపై ఆధారపడి యున్నారు. కుటుంబభార నిర్వహణ మెంతకష్టము. అదియుంగాక ఈ విద్యావిధానమే భారతీయులకు సరిపడలేదు. బి. ఎ. క్లాసు ప్యాసుచేసినను నెలకు పదిరూపాయలైనను స్వతంత్రముగా సంపాదించు కొనలేని ఈ చదువువలన ఏమి ప్రయోజనము, చదవక చేయునదేమి?

(ఇంతలో సురేంద్రుడు ప్రవేశించును.)

సురేం—నరేంద్రా! ఇంత ఎండలో ఎక్కడికి పోవుచున్నావు.

నరేం—సురేంద్రా! నా కష్టములు ఏమని చెప్పుదును. ఎవరితో చెప్పుకొందును. ఎచ్చటనైనను నెలకు 20 రూ॥ జీతము దొరుకునా యని అనేక ఆఫీసులు తిరిగి తిరిగి వచ్చితిని. ఎక్కడకుపోయినను ప్రయత్నము లన్నియును విఫలము లగుచున్నవి.

సురేం—

సీ. పాశ్చాత్యవిద్యాభ్యాసమో యని రాత్రింబ
వళ్ళును మనవాళ్ళు తుళ్ళినారు
విద్యకు యంపకు వెలలేని కట్నాలు
పోసి కొన్నాళ్ళు వాపోయినారు
స్వకులవిద్యలనెల్ల నమయించి పరధర్మ
ముల నాశ్రయించి యుపొంగినారు
నాస్తికవాదమ్మునకు జెవి యొగ్గుచు
సరదాగ తలలూపసాగినారు

గీ. ఇప్పు డుద్యోగములు లేక యేడ్చుచుండ
పేదయువకులు: బిడ్డలు పెల్లుపెరిగి,
చేయునదిలేక పెద్దలు చేష్టలుడిగి
తలలు వంచుకొన్నారు సిగ్గిలి నరేంద్ర!

సీ. ఏరోజు కారోజు కింత సంపాదించు
కూలీలు సుఖనిద్ర కూరినారు

ఎన్నో తరాల్ దాక ఎంతరూ నిల్వ శే
యు ధనికులకు భయంబున్న దేమి?
నెలకు సరిగను వందలు వేలు గడించు
నుద్యోగులకు భయం బున్న దేమి?
రైతుల రక్తధారలఁ బాయసముగ్రోలు
నరనాథులకును సంతత సుఖంబె

గీ. ఎలుకపై పిల్లి, పిల్లిపై నెలుక బెట్టి
జీవనముచేయువారికే చింతలేదు
పరువునకు లొంగి మానమ్ము పదిలపఱచి
ఎప్పుడో ఎంతగానో జీవించి అంత,

గీ. అంతరింపగ జీవనోపాధిలేక
సర్టిఫికెటున్నగాని, శిఫార్సులేని
నిన్నుబోలు విద్యాధికుల్ నిశ్చయముగ
మ్రగ్గుచున్నార లాకలి మంటలోన!

నరేంద్రా! భారతదేశమునకు ఈనిరుద్యోగ సమస్యా పరిష్కారము ఎట్లగునో నాకు తోచకున్నది.

నరేం—మిత్రమా! ప్రకృతి చిత్రమును తిలకింపుము. ఇప్పటికైనను మనవాళ్లు మేల్కొనిరా? నాల్గువందల యెకరముల పొలమును గల్గి పదివేల రూపాయిలు నిలువ యున్న వాడునూ సంతృప్తినొందక ఉద్యోగమునకై ప్రయత్నించి గొప్పవారి సిఫారసులగా సంపాదించి ఉద్యోగములను సంపాదించుచున్నారు. కాని ఈ నిరుపేదవానిని చూచు వారెవరు? ఆదరించు వారెవరు? ఇప్పుడు మనభారత దేశ

మందు ఉద్యోగము లనుభవించుచున్న అనేకమంది ధనవం
తులు తమ ఉద్యోగములు వదులుకున్నచో నావంటి పేద
వారికి పదివేలమందికి ఉద్యోగములు లభించగలవు, కాని
ఆశాపిశాచము మహా చెడ్డది కదా! ఆ పిశాచమును వద
లించుకొనుటకు ఎంతయో జ్ఞాన ముండవలయును.

సురేం——డిప్యూటీ కలెక్టరుగారు మంచివాడని వింటిని. ఆయ
నను చూచితివా?

నరేం——ఆయన మంచివాడే. పాప మాయన యేమి చేయ
గలడు. ఆయన మేనల్లుడు బి. ఏ. క్లాను ప్యాసయి
సిద్ధముగా నున్నాడు. అతని కిచ్చునా, నాకిచ్చునా.

సురేం——సబ్ జడ్జీగారిని చూచినావా?

నరేం——చూచితిని. నా సర్టిఫికెట్టులోని మార్కులన్నియు
బాగుగా నున్నవని మెచ్చుకొనియెను. ఉద్యోగ మిచ్చెద
నని కూడా వాగ్దానము చేసెను. ఈనా డుదయము వారిని
చూచితిని. కానిఏమిలాభము. ఛీఫ్ మేజస్ట్రేటు సిఫారసుతో
ఈరోజు ఉదయము మరియొక్క ఉత్తరము టపాలో వచ్చి
నది. దాని నాయన తిరస్కరించెనా, ఆయనకు ప్రమో
షను రాదు. కావున నా స్థితికి చాల విచారించి తీరదకు
లేదని చెప్పెను.

సురేం—— పోనీ, మీ నాయనగారి నెరిగిన వారెవరూ లేరా!

నరేం——లేకేమి? నాయనగారి టీపార్టీలకు హాజరయిన పెద్ద
లందరును ఇప్పుడు నన్ను దూరముననే చూచి తలుపులు
మూసుకొనుచున్నారు. హా, హా! మానవు లెంతకృత

ఘ్నులు? సురేంద్రా. కాని సురేంద్రా! భగవంతుడు దయా మయుడనియు కరుణాసాగరుడనియు చెప్పుకొందురు గాని నిజముగా భగవంతుడే ఉన్నచో ఆయన కఠినాత్ముడనియే అనవలయును. అట్టి దయాసముద్రుసి సృష్టిలోనా ఇట్టి దరిద్రదేవత తాండవమాడుట!

సురేం—నరేంద్రా! అట్లనకుము. వారువారు చేసిన కర్మాను సారముగా ఫలము నొసంగుచున్నాడు. గాన ఆయన లేడని చెప్పరాదు. దయాసముద్రుడు కాడనియు పలుక రాదు.

నరేం—ఔను సురేంద్రా! కష్టదశలో నుండుటచే అట్లు పల్కి తినిగాని యథార్థ మంతియే.

సురేం—నరేంద్రా! పొద్దుపోలేదా? మీ అమ్మగారు ఇంటి దగ్గర వేచుకొనియుండును. ఇంటికి పద. తర్వాత ఆలోచించుకొనవచ్చును.

(ఇరువురు నిష్క్రమింతురు.)

(తెర ఎత్తబడును.)

(నరేంద్రుని ఇల్లు, భువనేశ్వరీమాత కూర్చొనియుండును. నరేంద్రుడు ప్రవేశించి నమస్కరించును.)

భువనేశ్వరీమాత—నాయనా! ఇంత పొద్దుపోయినను భోజ నమునకు రాకుంటివేమి? ముఖమిట్లు వాడిపోయిన దేమిరా, భోజనమునకు లెమ్ము.

నరేం—అమ్మా? ఈపూట బియ్యమెక్కడ తెచ్చితివి?

భువ—నాయనా! పక్కయింటివారి దగ్గర బదులు తెచ్చితిని.

నరేం——ఎన్ని బియ్యము తెచ్చితివి?

భువ——ఇదివరకే నాకిక్కి చాలా అప్పు పడితిమి. కాన రెండు సోలలకంటె ఎక్కువ నివ్వమనిరి.

నరేం——(స్వ) రెండు సోలల బియ్యము మా నలుగు రైదు గురికి సరిపోవునా? మాత, ఉపవాసము వుండవలసినదే. (ప్ర) అమ్మా! మార్గమున ఒక స్నేహితుడు భోజనమునకు పిల్చెను. అక్కడికిపోయి భోజనము చేసివచ్చితిని. నీవు త్వరగా పోయి భోజనము చేయుమమ్మా!

భు——నాయనా! నాభోజనముమాట కేమిగాని ఆదక్షిణేశ్వరము నందలి పిచ్చివానితో నీవు సహవాసము చేయుచున్నది మొదలు మన కన్నియూ కష్టములే వచ్చుచున్నవి. వాని స్నేహము మాని ఏ పేదయింటిపిల్లనో పెళ్లిచేసుకో రాదా, నాయనా.

నరేం——అమ్మా! నా పొట్టకే సంపాదించుకొనలేని వాడను ఇంకొక పిల్లను మెడకు కట్టుకొని నన్నేమి చేయుమందువు. అదిగాక బ్రహ్మచర్యాశ్రమమే శ్రేష్ఠమయినదమ్మా! జగద్గురు శంకరాచార్యస్వామి బ్రహ్మచర్యాశ్రమమునుంచే సన్యసించి ప్రపంచమునకు జ్ఞానభిక్షనొసంగియుండలేదా! గృహస్థాశ్రమమునం దేమి సుఖమున్నదమ్మా!

భు——నరేంద్రా! ఆ పిచ్చివాడే మనకొంప తీయుచున్నాడురా. నీ కీ యుద్దేశ్యము లన్నియు అతడే కల్పించుచున్నాడు.

నరేం——అమ్మా! అట్లనకుము. ఆయన భగవత్ స్వరూపము. ఆయన శక్తియుక్తులను గ్రహించియే ఆయనసహవాసము

చేయుచుంటిని. అట్టి మహానీయుడు బంగాళా దేశమునం దింక నుండడు.

భు— అట్లైనచో నీవింత కష్టపడు చుంటివిగద. నీ కష్టము లలో నేకీభవించెనా? నిన్నెంతయో ప్రేమించు చున్నా డందువు! నీ కేమి సహాయము చేసెను?

నరేం—అమ్మా! యీ విషయము లాయనకు నేను చెప్పను లేదు. సహాయము కోరను లేదు.

భు—ఆయన యోగియని చెప్పెదువుగద, నీ కష్టము లాయన యెఱుంగడా ?

నరేం—ఆయన యెఱింగియే యుండవచ్చును. ఐనను ప్రతిక్రియ చేయకుండుట కేదో గొప్ప కారణముండవలయును. ఐనను నేడు దక్షిణేశ్వరాలయమునకు పోయి ఈ విషయము ప్రస్తా వించెదను. నిజమైన ప్రేమ బయట బడును.

భు—అట్లే చేసి చూడుము.

నరేం—సరేనమ్మా (ముందునకు వచ్చును) [తెరపడును.]

గీ. పలుకులనె, ప్రేమ చూపించువారు గలరు
చూపులందె గలరు ప్రేమచూపువారు
జాలిపడను వారు గలరు చాలమంది
వెలసెనా? సాయమొనరించు ప్రేమమూర్తి
అతడ దైవమ్మగాదె! దీనాళికెల్ల.

(నిష్క్రమించును.)

## రంగము 14

(గంగానదీతీరమున రామకృష్ణుడు పచారు చేయుచుండును.)

(బెనర్జి వచ్చి నమస్కారము చేసి నిలుచబడును.)

రామ—ఏమోయి! సమాచారము లేమి? నరేంద్రుడు సుఖముగా నున్నాడా?

బెనర్జి—తండ్రిగారు మరణించిన వెనుక వారి కుటుంబపరిస్థితులు నీరసస్థితిలో నున్నవి. కుటుంబభార మాతనిపై బడినది. ఉద్యోగమునకై ప్రాకులాడుచున్నాడు. ఉద్యోగము దొరుకుట లేదు. సంసారమునకా నెలకు నూరు రూపాయలు కావలసియున్నది. ఇంటియందు దరిద్రదేవత తాండవమాడుచున్నది.

రామ—అంతచదివినవానికే ఉద్యోగములేదా? ధనమునకై చేయరాని పనులు చేయుటలేదు కదా!

బెనర్జి—చేయకుండునంతటి ధైర్యశాలియా నరేంద్రుడు? ఒకప్పుడు దేవుడే లేడని పలుకుచున్నాడు. ఒకప్పుడు ఆయనను ప్రార్థించుట వ్యర్థ మనుచున్నాడు. దేవుడు దయానముద్రుడనుట కల్ల యనుచున్నాడు, ఇక నరేంద్రుడు చెడిపోక బాగుపడునా. జూదరు లగు స్నేహితులతో గూడ సహవాసము చేయుచున్నాడు. దేవుడే లేడను వానికి పాపభీతి ఎక్కడ? పాపభీతి లేనివాడు ఏ కార్యమును చేయజాలడు?

రామ—బెనర్జీ! ఇట్టిమాటలు నాచెవిని ఇక నెప్పుడును వేయ

కుము. అతని తత్త్వము నాకంటె నీకెక్కువ తెలియునా? అసత్యపు ప్రవర్తనకుగాని, అన్యాయార్జితమునకుగాని అతడెన్నడును దిగడు. అతనిగూర్చి ఈ పర్యాయము ఏ మాత్రము చెడు నీవు చెప్పినను నిన్ను నాదగ్గరకు రానీయను. నీ మొగముచూడను. జాగ్రత! అదుగో నరేంద్రుడును వచ్చుచున్నాడు.

ఉ. భారతి భాగ్యదేవత! అపార కృపారసధార! అన్య భా
మారతి దూరు, డార్తజనబాంధవు, డుజ్జ్వల కీర్తి దీపికో
దారు డుదారు డస్ఖలిత తత్త్వవివేక వినోది, ముక్తి కాం
తారమణీయ పాదవనదాంతర మోహన మూర్తి అల్లదే.

గీ. రార ఆహ్వానమొనరింతురా కుమార
రార బంగరుకొండ రారా ముకుంద
రార వశ్రిలతునకె రారా మురారి
రార నామనోహర వేగ రార తండ్రి.

(అని యెదురేగి కౌగలించుకొనును. బెనర్జి చల్లగా వెనుకకు నిష్క్రమించును.)

రామ—నరేంద్రా! నీవు రానికతమున నా కన్నులు కాయలు కాచినవోయి. చంద్రోదయము మట్లు నిన్నుచూచిన నాకు ఆహ్లాద మగును. ఇంత తడవేల చేసితివోయి. అప్పుడే వచ్చెదనని వాగ్దానము చేసిపోతివే. రాత్రింబవళ్ళు నిన్ను కలువరించుచున్నానోయి.

నరేం—సన్నెందుల కండీ మీా రింతగా తలంచుట. నావలన దాకేమానును. నాతో మీాకేమిపని యున్నది. జడ భర

తుడు లేడనిగూర్చి కలవరించి, కలవరించి, చచ్చి చివరకు లేడైయె పుట్టినాడు. అట్లే తమరును నన్ను తలచి తలచి తుదకు నాపై భ్రాంతితో చచ్చినచో మీరేమగుదురో?

రామ—అరే నరేంద్రా! ఏమంటివి. నేను ప్రేమించునది నిన్ను కాదు, నేను ధ్యానించునది నిన్ను కాదు, నేను కలవరించునది నిన్ను కాదు. నీ శరీరమున మూర్తీభవించుచున్న ఆ సాక్షాత్తు శంకరమూర్తినే నని కాళికాదేవి అనేక పర్యాయములు నాకు చెప్పినది.

నరే—నేను శంకరుడనో, విష్ణువనో నాకు తెలియదుగాని నా ప్రస్తుతస్థితి విన్నచో ఎట్టి కఠినాత్మునికైనను జాలి కలుగక మానదు.

రామ—నరేంద్రా! నీ కంత కష్టస్థితి యేమి వచ్చినది.

నరే—సుఖముగా దక్షిణేశ్వరాలయములో కుడిచి కూర్చున్న మీకు లోకుల కష్టమేమి తెలియును. ఇంటిదగ్గర మా అమ్మ మొదలయినవారు మలమల మాడుచున్నారు. నాకా ఉద్యోగము దొరకలేదు. వెయ్యి వేదాంత గ్రంథములు పఠించితిని, కూటికా గుడ్డకా? ప్రపంచము నందలి అన్ని మతములు చదివితిని, పప్పునకా ఉప్పునకా? నా యీ విద్యాభ్యాసమునకై మా నాయనగారు అనేక వేలు ఖర్చు పెట్టిరి. తమలపాకునకా వక్కకా? మీరేమో నేను దేవుడనని, దయ్యమునని చెప్పుదురు. ఎచ్చట నున్నను ఇంటి చింత యే పట్టినది. 'నిన్ను కష్టముల నుండి ఉద్ధరించ నేరని ఆ పిచ్చివాని దగ్గఱకు ఏల పోవుదు'వని మాఅమ్మగారుఇంటి

దగ్గర బాధించుచున్నారు. నీవో! వచ్చెదవా లేదా, వచ్చెదవా లేదా, ఎప్పుడువచ్చెద వని పల్కుచుందువు. ఆకలి వేళకు నీరు త్రాగవలసినదే గాని గంజికూడా లేదు. మీరు భగవంతుని చూచినారు కదా, భగవంతునితో చెప్పి నా కేదైన ఉద్యోగ మిప్పించరాదూ.

రామ—ఇప్పటికే నీకు కాళికాదేవి ఉద్యోగ మిప్పించి యుండును. అమ్మయందు నీకు విశ్వాసములేదుకదా. బ్రహ్మసమాజములో పెరిగితివి. వారిమాటలనే నమ్మెదువుకాని నా మాటలు నమ్మవు. భగవంతునికి సాకార నిరాకారములు రెండునూ కలవు.

నరేం—భగవంతుని కాకారమా. కాళికా దేవి భగవంతుడా! రాతిబొమ్మ రక్షించునా!

ఆ. చలువరాతిబొమ్మ సాకార మేగాని
చూపు పలుకు లేని శుద్ధమూర్తి
సాయ మేమి సేయు! సాయ మట్లుండనీ!
మాటలాడగలదె! మానిసివలె?

రామ—నరేంద్రా! ఒక్కసారి అమ్మవారి ఆలయములో కాలుపెట్టి నీకు కావలసినవాని నడుగుము. ఇంతేల! నా నోట వచ్చిన పల్కు లన్నియు యథార్థమని నీ నోటనే పల్కించెదను.

నరేం—(వెత్తి నవ్వు నవ్వుచు) రాతి బొమ్మకు మొక్కవలయునా? మీ నోటి నుండి వెడలిన పల్కులు పిచ్చివాని పల్కులో, జ్ఞానిపల్కులో నే నర్థము చేసికొనలేక

యున్నాను. (స్వ) ఈ సమాచారము మా బ్రహ్మసమాజ మిత్రులకు తెలిసిన నవ్వరా. నవ్వుదురుగాక! నవ్వినవారు నా కుద్యోగ మిప్పించగలరా. పోసీ, వారిమాటలు విశ్వసించనిచో నేను చేయున దేమున్నది. పరీక్షనిమిత్తమయినను ఒక్కసారి మ్రొక్కనచో నష్టమేమున్నది? (ప్ర) అయ్యా! అట్లే చేసి చూచెదను.

రామ—నరేంద్రా! పొమ్ము. నీకు కావలసిన వన్నియు అమ్మ నడుగుము.

(రామకృష్ణుడు ప్రక్కకు వచ్చును. తెర ఎత్తబడును. కాళీకాదేవి ఆలయము)

(నరేంద్రుడు ప్రవేశించి, సాష్టాంగ దండప్రణామ మొనర్చి ...)

నరేం—అమ్మా! జగజ్జననీ!

కా—ఆ! బిడ్డా! నీ కేమి కావలయునో కోరుకొనుము.

నరేం—ఏమిది? ప్రపంచమునం దెన్నడును కని విని యెరుంగని ఆశ్చర్యము. ఎంత భ్రాంతిలో మునిగితిని. ఎంత అజ్ఞానములో మెలంగితిని. అమ్మను రాతిబొమ్మ యని దూషించితినే! ఆహా! ఏమి రామకృష్ణుని శక్తి.

గీ. విగ్రహారాధనము తప్పు; వెడలవలదు
విగ్రహము లున్నచోటికిన్; విగ్రహంబు
రాతిబొమ్మ యటంచు పల్కుచువారు
ఇప్పుడేమి సమాధాన మీయగలరొ.

అమ్మా! అమ్మా! భక్తి జ్ఞాన వైరాగ్యములకై నిన్ను యాచించుచున్నాను.

కా—తథాస్తు.

(నరేంద్రుడు ముందునకు వచ్చును. తెరపడును.)

(రామకృష్ణుడు ప్రక్కనుండివచ్చి)

రామ—నరేంద్రా! అమ్మ మాట్లాడినదా?

నరేం—గురువర్యా! మూడులోకములందును మీతో సమాన మగువా రుండరు. చిత్రము! చిత్రము! అమ్మ మాట్లాడినది.

రామ—నీ కష్టములన్నియు చెప్పు కుంటివా?

నరేం—అయ్యో. ఆ విషయమే మరచితినండీ.

రామ—ఏమడిగితివి?

నరేం—భక్తి, జ్ఞాన, వైరాగ్యముల నడిగితిని.

రామ—నరే, మించిన దేమియూ లేదు. ఈ పర్యాయము నీ మనస్సు స్వాధీనములో నుంచుకొని కావలసిన వన్నియు అడుగుము. మరల అమ్మదగ్గరకు పొమ్ము.

(రామకృష్ణుడు ప్రక్కకు పోవును)

నరేం—(స్వ) నా మనోధైర్యమునకు నేను గర్వించవలసినదే. నామనస్సు నా స్వాధీనము తప్పి ఎన్నడును పోజాలదు. ఎవ్వరునూ నామనస్సు వంచలేరు. ఎట్లో నా మనస్సు పిచ్చివానికి లొంగిపోవుచున్నది. ఈ పర్యాయము ఎంతో జాగ్రత్తతో అమ్మదగ్గర సంచరించి నా కష్టములు చెప్పు కొనెదను.

[తెర ఎత్తబడును]

(నరేంద్రుడు లోన ప్రవేశించి సాష్టాంగ నమస్కారము చేసి లేచి నిలువ బడును.)

నరేం—అమ్మా! జగజ్జనని!

కా—నాయనా! నీ నిమిత్తమై దేవేంద్రపదవి సిద్ధపరచియుంచితిని.

నరేం—నాకక్కర లేదు.

కా—అట్లయిన భూలోకములో ఏకచ్ఛత్రాధిపత్యము నీకు కరతలామలకము గానున్నది.

నరేం—నాకువలదు, వలదమ్మా.

కా—పూర్వము నీ వనుభవించిన భోగములకు వేయిరెట్లు భోగము లియ్యదలచుకున్నాను. వజ్రపు తునుకవంటి భార్యకూడా.

నరేం—ఇట్టితుచ్ఛపు కోరికలకై నీ దగ్గరకు రాలేదమ్మా!

కా—మరేమి కావలయునురా?

నరేం—దేశభక్తి. దేశభక్తి. దేశభక్తి. దేశభక్తి. దేశముక్తి. దేశముక్తి. నా భారత దేశముక్తి.

కా—తధాస్తు.

(నరేంద్రుడు ముందునకు వచ్చును.) [తెరపడును]

(రామకృష్ణుడు ప్రక్కనుండి వచ్చును.)

రామ—నరేంద్రా! నీ కోర్కె తీరినదా?

నరేం—ఇదంతయు మోసముగా నున్నది. నాకేమియు బోధపడుటలేదు. అమ్మయెదుట నిలుచునప్పటికి నా మనస్సు

నెవ్వరో స్వాధీనపరచుకొనిన ట్లున్నది. ఉద్యోగము నను
గుట మాటయే మరచితిని.

రామ—మరేమి కోరితివి.

నరేం—దేశభక్తి దేశభక్తి కావలయునని కోరితిని. అమ్మ నాకేమేనా ఇచ్చెదనని చెప్పినది. మూడు లోకములకు రాణియగు అమ్మదగ్గర స్వల్పఉద్యోగమునకై యాచించుట సిగ్గనిపించినది.

గీ. మూడు లోకమ్ములేలెడు మోహనాంగి
ఆమె దర్శనమంది, మాట్లాడి కూడ,
మోహమొందునె? తుచ్ఛపుం భోగములకు
మానవుం డెవ్వడేని, యొండైనగాని!

రామ—(నరేంద్రుని భుజములు తట్టుచు) నరేంద్రా! నీవు తుచ్ఛ సుఖముల ననుభవించుటకై ఈ ప్రపంచమున పుట్టియుండలేదు. ప్రస్తుతము నీకును భారతదేశమునకును అవసరమయిన కోర్కెలనే నీవు అమ్మ నడిగితివి. నీ భావి జీవితము అమోఘమైనది. నీవు స్వార్థత్యాగమునకై పుట్టితివిగాని స్వార్థమునకై పుట్టలేదు. ఇట్టి నీ నోటివెంట తుచ్ఛపు కోర్కెలు వచ్చునే. ఇంక ఉద్యోగవిషయమా, నీ జీవితమున నీవు భారతమాతకే సేవచేయగలవు గాని అల్పధనమునకై స్వల్పమానవునికి సేవ చేయజాలవు. ఇంక ఇంటియందలి పేదరికమా, కాళికాదేవి నీ తమ్ములలో నెవరికైన ఉద్యోగ మిప్పించి దానిని బాపగలదు. ఇంక వివాహ విషయమా, నీవు ముక్తికాంతను పెండ్లి

యూడవలయునేగాని సామాన్యస్త్రీని నీవు వివాహ
మాడుచో నేను చూచి భరించగలనా? సహించగలనా?
హిందూమతామూల్యసిద్ధాంతములు ప్రపంచమున వెద
జల్లుటకు నీవే అర్హుడవు. నీవే ధీరుడవు.

నరేం—మహాత్మా! అమ్మ గొప్పతన మెరింగితిని. సంసా
రాంధకారమునుండి లేవదీయుటకు నీకంటె నాకెవ
రున్నారు? తలిదండ్రులుగాని, బంధువులు స్నేహితులు
గాని, అన్నదమ్ములుగాని మృత్యుభయమునుండి లేవ
దీయలేరు. అట్టి మృత్యుభయము జ్ఞానార్జనమువలనగాని
పోవదు. అట్టి జ్ఞానభిక్ష పెట్టుటకు నీకంటె నెవ్వడున్నాడు.
శిష్య స్తేహం శాధి మాం త్వాం ప్రపన్నమ్.

(అని సాష్టాంగ నమస్కారము చేయును. రామకృష్ణుడు లేవదీసి)

రామ—నరేంద్రా! నన్నుగాని మరియొక్కరిని గాని పరీక్ష
చేయనిదే గురువుగా స్వీకరింపవలదు. రూపాయను
మ్రోగించినట్లు మ్రోగించిగాని గురువును అంగీకరించవలదు.

నరేం—పొద్దు పోయినది. ఇంటికి పోయెదను. అమ్మగారు
ఇంటిదగ్గర వేచియుందురు.

రామ—అట్లే పోయిరమ్మా. త్వరలో రావలయును సుమా.
నిన్ను చూడక ఒక క్షణముండజాలను.

నరేం—తప్పక వచ్చెదను.

## రంగము 15.

(నరేంద్రుడు కాషాయ వస్త్రధారియై పద్మాసనము వేసుకొని కూర్చుని యుండును.)

ఊర్ధ్వ దృష్టితో నుండును.

రా—నరేంద్రా! (నరేంద్రునికి ప్రపంచదృష్టి లేదు.)

రా—నరేంద్రా (నరేంద్రుడు పలుకడు.)

శారదా! ఇటురమ్మ.

(శారదాదేవి ప్రవేశించును.)

రా—శారదా! నరేంద్రుని పిలువుము.

శా—నరేంద్రా! (నరేంద్రుడు పలుకడు.)

రా—శారదా! నరేంద్రు డిప్పుడు నిర్వికల్పస్థితియందున్నాడు.

శా—నాకును అట్లే తోచుచున్నది. మీ కటాక్షబలము చేతనే కదా, ఈ యువకు డా స్థితికి రాగలిగినాడు. కామినీ కాంచనములందు మీ రెంత వైరాగ్యముతో నుండిరో మీ శిష్యుడును అట్లే తయారయ్యె.

రా—శారదా! నేను నీ పుట్టినింటికి వచ్చినప్పుడు మీ అమ్మ గారు ఒకపర్యాయము మనలను చూచి మీరు బిడ్డలను గన చూచు భాగ్యము లేదుకదా యని వాపోయెను. ఇప్పుడామె జీవించియున్నచో ఈ నీ బిడ్డనుచూచి యెంత మెచ్చుకొనునో.

(పదిమంది యువకులు పాటపాడుకొనుచు ప్రవేశించి రామకృష్ణునికి నమస్కారము చేయుదురు. తరువాత శారదకు, తరువాత నరేంద్రునకు నమస్కారము చేసి నిలబడుదురు.)

రా—నాయనలారా! కొలది రోజులలో కాళికాదేవి నా ఈ

శరీరమును లయము చేసికొనగలదు. శారదాదేవి మాకు తల్లి. వివేకానందస్వామి మాకు పెద్దన్న. పెద్దన్న తండ్రితో సమానము. గావున మా రాతనిని తండ్రితో సమానముగా భావించవలయును. పితృసమానో జ్యేష్ఠో భ్రాతా యని పెద్దలు పలుకుదురు. నరేంద్రుడు సాక్షాత్ శివావతారము గాని సామాన్యుడు కాడు. అతని పాదస్పర్శచే భారత భూమి పవిత్రమయ్యె.

గీ. ఇతడు సామాన్యుడనుచు మీ రెంతురేమొ
భవ సముద్రమ్మునం బడి, పరితపించు
దుఃఖజీవుల క్లేశముల్ తొలగద్రోయ
అవతరించిన తరణి సుమ్మా యితండు!

గీ. తెరవుగానక అజ్ఞాన తిమిర మందు
నడచి పడిపోవు పాంథసంతతుల నెల్ల
నుద్ధరింపగ ధరణి నభ్యుదయ మొందె
సర్వ సంవేది, జ్ఞానభాస్కరు డితండు.

గీ. భావి భారతదేశ సౌభాగ్య మెల్ల
మీ భుజస్కంధముల యందు మొలగుగాన
దాని కగుదీప్తి సర్వ దిక్తటములందు
చల్లగల శక్తి ఈత డొసంగు మీకు.

తే. అతని పాదాబ్జములె శరణ్యములు మీకు
అతని ఆశీర్వచనము, భవ్యమ్ము మీకు
అతని కటాక్ష మాలిక లవసరములు
అతని సేవించు జన్మ ధన్యమ్ము సుండు.

(నరేంద్రుడు కాంచెము కదలి, లేచి చూచి రామకృష్ణునకు, శారదా దేవికి నమస్కరించును.)

నరే—గురువర్యా! సర్వసందేహనివృత్తి యయ్యె.

గీ. భారతీయుల వేద భాండార సార
మిట్లు మీ రూపమునను మూర్తీభవించె
ప్రాచ్య విజ్ఞాన దివ్య సంపత్తి కెల్ల
నీవ ఆధారమవు కాద నిర్మలాత్మ.

మీ కటాక్ష బలముచే అఖిలమత సారంబుల నెరింగి తిని. అఖిల వేదాంత రహస్యంబుల నెరింగితి. సవికల్ప, నిర్వి కల్ప సమాధుల తత్త్వము అనుభవగోచర మొనర్చితి. పరోక్ష అపరోక్ష సాక్షాత్కార జ్ఞానమంతయు కరతలామలకం బొన ర్చితి. కావుననే ఆనందామృతమున నోలలాడు చుంటిని. ఇంక నాకు కావలసిన దేదియు కాన్పించుటలేదు.

శారద—నాయనా! జాగ్రత్తగా ఆలోచించుకొనుము. నీ కేమియు కాన్పించుట లేదు?

రామ—శారదా! ఆ విషయము నేనే చెప్ప బోవుచున్నాను. నరేంద్రా! నీకేమియు తోచుట లేదా?

నరే—గురువర్యా! నిర్వికల్ప సమాధియందు నిరంతరము ఆనంద మగ్నుడనై యుండెదను.

రామ—నరేంద్రా! ఇట్టి తుచ్ఛకోర్కె నీకెట్లు గల్గె; నీ ఆనం దమునే నీవు చూచుకొనుచున్నావా! సామాన్య మాన వుల వలె నీకును, స్వార్థమే, అంకురించెనా? పరమ పవిత్ర మగు దేశసేవాభాగ్యము నొంది, భారతీయులకే గాక

ప్రపంచమున కంతకును, జ్ఞానదాన మొసంగి, భగవంతు డిచ్చిన తనువు, జ్ఞానధనము, భగవంతునియొక్క బిడ్డలకే వినియోగించద వనుకొంటి గాని, దేశమెట్లున్నను సరే, నీ సహోదరు లెట్లున్నను సరే, నీయంతట నీవొక మూల దావళము త్రిప్పుకొనుచు శివోహమ్ శివోహమ్ అను కొనుచు హృదయములేని సన్యాసివలె కూర్చుందు వనుకొన లేదు. కాళికాదేవి నాకర్పించిన బ్రహ్మజ్ఞానధనమంతయు నీకు ధారవోసినది నీ ఆనందము నిమిత్తము, నీ సుఖము నిమిత్తమే యనుకొంటివా?

నరేం—గురువర్యా! క్షమింపకోరుచున్నాను. తమ ఆదేశాను సారముగా వర్తించెదను.

రామ—నరేంద్రా! ఈ ప్రపంచమును పునాదులతో పెకల్ప సామర్థ్యము గలవాడవు నీవు. మానవుల అజ్ఞానాంధకార మును పటాపంచలు కావించగల ధీరుడవు నీవు. భారతదేశ విజ్ఞానమును ప్రపంచమంతటను వెదజల్లగలవాడవే నీవు.

గీ. ఆర్యవిజ్ఞాన సామ్రాజ్య మధివసించి
వేద భాండార జలధిలో ఈదులాడి
ఆరితేరిన మూర్తి వీ వరసిచూడ
నీదు సౌఖ్యమ్ము కొఱకు జన్మించినావె.

గీ. జాతి కుల మత భేదముల్ సరకు గొనక
సత్య సందేశమును నీవు చాటవలయు,
అందులకు నీవొకండవె యర్హమూర్తి
వార! నీసాటి నీవె కాదా కుమార.

సన్న్యాసియగువాడు కొంతకాలము ఏకాంతముగ దేశాటన మొనర్పవలయును.

గీ. చెప్పవలసిన బుద్ధులఁ జెప్పినాఁడ
శాస్త్ర మర్యాద లెరుఁగుదు చాలవఱకు
కొంత లోకానుభవము చేకొన్నపిదప
బుద్ధి తెలిసినదారినే పోఁగదన్న.

నాయనా! వివేకానందుఁడవై వర్ధిల్లుము.

శారద—నాయనా! వివేకానందా!

గీ. ఈవు పులిపిల్లవే సుమీ, ఎంచిచూడ,
గావు సామాన్యుఁడవు, త్రిలోకంబులైన
నొక్కటకడకు లేజాలిన యుక్కులుండ
నైన మా శుభాశీస్సుల నందుకొమ్మ!

(ఇరువురును వివేకానందుని శిరస్సుపై చేతులు చాపుదురు.)

(తెరపడును) (నరేంద్రుఁడు ముందునకు వచ్చును.)

నరే—ఓహో ! ఉపనిషత్సందేశమునం దెంత మాధుర్యమున్నది! మదరాసుపౌరులుగాని, హైదరాబాదు పౌరులుగాని, ఉపనిషన్మాత నెంత గౌరవించిరి. సత్యము గౌరవింపబడక అసత్యము గౌరవింపబడునా! ఈమహత్తరమగు ఆధ్యాత్మిక సందేశమును, మహర్షులు భారతీయులకొఱకే అర్పించిరా! "లోకా స్సమస్తా స్సుఖినో భవన్తు" అను నార్యోక్తి వ్రకార మీ సందేశమును పాశ్చాత్యదేశవాసులు కూడ విని సుఖింపవలదా! నా పాశ్చాత్యదేశ సోదరసోదరీ మణులకే వేదాంత తత్త్వ ముపదేశించుటకై నా మనం బువ్విళ్లూరుచున్నయది. మిత్రులనేకులు ధనము గూర్చి యిచ్చెద

మని చెప్పుచున్నారు. కాని గుర్వాజ్ఞ యైనట్లు నాకేమియు నిదర్శనము కాన్పించుటలేదు. ఐనను నేనిందులకు తగుదునా?

మిత్రుడు:—మీరేయిందులకుతగుదురు. పాశ్చాత్యదేశ ప్రయాణమునకు ఛాందసులుతగరు. అదిగాక, నవీనపద్ధతుల ప్రకారము వారికి బోధించవలయును. మీరా, గీర్వాణ భాష చక్కగనేర్చితిరి? గంగాప్రవాహమువలె నుపన్యసింపగలరు. వేదవేదాంగముల సారం బంతయు గ్రహించితిరి. సకల పురాణేతిహాసములు నవలోకించితిరి. ప్రపంచమునం గల మతము లన్నియు పరిశీలించితిరి. సామవేద మభ్యసించి, చక్కగా గానము నేర్చుకొంటిరి. నాడు మొదలు నేటివరకు గల గొప్పగొప్ప వేదాంతుల అభిప్రాయములను తెలిసికొని సమన్వయింపగల సమర్థులైతిరి. అద్వైత విశిష్టాద్వైత ద్వైత మర్మంబులన్నియు గ్రహించితిరి. ఇస్లాముమత క్రైస్తవమత సారాంశములు హృద్గతము గావించుకొనిరి. ఇంత యేల? బ్రహ్మజ్ఞానియగు శ్రీరామకృష్ణపరమహంస పాదకమలస్పర్శచే ధన్యులైతిరి! మీకన్న నింక సమర్థు డెవడు? ఆయా దేశ భాషలు మాట్లాడగల శక్తియు మీకు గలదు. కామినీ కాంచనముల తృణప్రాయముగా చూడగల మీకే ప్రపంచమే దాస్యమొనర్చదా? ఒక్క పాశ్చాత్యఖండ విషయ మేమి? వివేకానందషే యిట్లు మూర్తీభవించె.

వివేక:—ఐనను మిత్రమా! గుర్వనుగ్రహము గల్గిన చిహ్నము కన్పించలేదు. శారదామాతదగ్గర నుండి ప్రత్యుత్తరమును రాలేదు. నా యుద్దేశ్యము కేవల పాశ్చాత్య

దేశాటనకే గాదు - అమెరికాలో - చికాగోలో జరుగ నున్న ప్రపంచ సర్వమత మహాసభలో వేదాంత ఢంకా మ్రోగించి యుపనిషన్మాత పాదధూళిచే వారిని పవిత్రులుగ సౌనర్చవలయు నను ఇచ్ఛ నన్ను బలవత్తరముగా బాధించుచున్నది.

(ఒక మిత్రుడు లేఖ దెచ్చును.)

వివేకా—ఎక్కడ నుండి.

మిత్రుడు—శారదా దేవిగారి దగ్గరనుండి

వివేకా—మా అమ్మదగ్గర నుండియా! ఏదీ!

(లేఖను కన్నుల కద్దుకొని - చించి - చదువును.)

'కుమారా! ఇన్ని నాళ్లుగా నీ సమాచారమే తెలియక ఆందోళన పడుచుంటిని. నేడు నీ లేఖ చూడగానే ఆనంద మయ్యె. పాశ్చాత్య దేశప్రయాణమునకు ఇంకను సందేహించు చుంటివా? అన్నిమతములు చక్కబడవలయు ననియే గదా మన గురువుగారి యుద్దేశము. నిన్నాశీర్వదించుచున్నాను. తక్షణమే బయలుదేరి పోయి ప్రపంచసర్వమతమహాసభలో ప్రవేశించుము. మన గురువుగారు దారి చూపింపగలరు.'

— శారద.

ఓహో! అమ్మ ఆజ్ఞ యైనది. మిత్రమా! ఇంక తడవు సేయను. మనకు ధన సహాయము చేయుదు మన్న వారికి శుభసమాచారము తెలియజేయుము. పోయి రమ్మా. కొంచెము విశ్రమింతును.

(మిత్రుడు, వివేకానందుడు నిష్క్రమింతురు)

## రంగము 16.

(వివేకానందుడు నిద్రించుచుండును.)

వివేకా—(ప్రాతఃకాలమున లేచి సముద్రముపైన శ్రీరామకృష్ణుని నడకచూచి) ఓహో! ఏమి ఈ దృశ్యము! గురువుగారే ఎందుల కిట్లు దర్శన మిచ్చిరి. నా కుత్సాహము కల్గించుటకా? ఏమా ప్రసన్నవదనము. నా కనుజ్ఞనొసంగితిరా! సముద్రముపైన నడచుచుంటిరే! సముద్రయానము నన్ను జేయు మనియేనా? పశ్చిమముగా పోవుచుండిరే! ప్రపంచ సర్వమత మహాసభకు నన్ను పొమ్మనియేనా! ఆ! ఆ! అదృశ్యులైతిరే. ఇంతలో - ఇంకను సందేహ మెందులకు?

శా. ఆ పాశ్చాత్య విదేశముల్ తిరిగి బ్రహ్మజ్ఞాన గంగామృతం
బా పాశ్చాత్యులఁ ద్రావజేసి భరతాంబాదివ్య నవ్యోత్పల
శ్రీపాదంబుల ధూళి జల్లి సురసంసేవ్యంబు, భోగ్యంబు నా
నీపుణ్యస్థలి చేరకున్న నుపశాంతిన్ బొంద నా కానగో!

మ. శుభచిహ్నంబు లొకొక్కటే గలిగె; సంశోభించె మన్మానస
ప్రభ; ప్రాచీదిశ కానిపించు తరుణార్కజ్యోతి భాస్వంతమై
నభమందల్లుకొనం దొడంగెడిని విజ్ఞానామృతస్వాదితే
ది భరంబా? నత డేది వూనిన జయంబే గాని ఓటున్నదే!

జగన్మోహన్—స్వామిజీ మహారాజ్!

(వందన మొనర్చును.)

వివేకా—ఓ! జగన్మోహన్—కూర్చుండుము. చక్రవర్తిగారికి కులాసాగదా!

జగ—స్వామీజీ! చక్రవర్తిగారికి పుత్రోదయ మైనది. వారి ఆనందము తమరు వచ్చినగాని పూర్తిగాదని, చక్రవర్తి గారు తమ్ము తప్పక తీసికొని రావలసినదిగ నన్నంపినారు.

వివేకా—జగన్మోహనా! ఇప్పు డెట్లు ఏలగును!

ఏను పాశ్చాత్యదేశ ప్రయాణమునకు
మనసు పెట్టితి నివు డెట్లు మార్చుకొందు!

జగ— ప్రేమ నొకవూట చక్రవర్తికి ముదంబు
నిచ్చి అటనుండి మీరు పోవచ్చు ననఘ!

తమయందు పంచప్రాణములు పెట్టుకొని తమ దర్శనార్థమై ప్రభువు కలవరించుచున్నాడు. తమరు తప్పక దయచేయవలయును. అచ్చటనుండియే అమెరికా పోవు ఏర్పాటులు ప్రభువే చేయగలడు.

వివేకా—ఏమి ఈ విచిత్రసంఘటనము! శ్రీరామకృష్ణుడు ప్రయాణ సౌకర్యములతో యేర్పాట్లను గూడ గావించుచున్నాడు.

గీ. గురువు సంకల్ప మొనరింప తిరుగుగలదె!
గురువు మార్గమ్ము చూపింప బరువుగలదె!
గురు కటాక్షంబు ప్రసరింప కొదువగలదె!
గురువు ప్రేమకు సాక్షి యీ ధరణి గలదె!

గీ. గురువు పాదాబ్జ సేవలు గూడవచ్చు
గురువు దీక్ష ప్రసాదముల్ గూడవచ్చు
గురువు జ్ఞానామృత రసంబు దొరకుటన్న
పూర్వపుణ్యమదెంతయో పొసగవలదె!

మిత్రమా! అట్లె పోవుదము. పద

(నిష్క్రమింతురు.) (తెరపడును.)

## 17. రంగము.

(చికాగో హోటలులో వివేకానందస్వామివారు)

ఓహో! ఏమి ఈ పట్టణ ప్రజల కోలాహలము! ప్రపంచమున నెచ్చటలేని గొప్ప సంతత జరుగుచున్నందున ఇట్లుండ నోపు. వీరి విలాసము లేమి! భోగము లేమి! సొగసు లేమి! ఇక్కడి చిత్తమైనను పరమేశ్వరాయత్త మగుటకు తగిన వాతావరణమే కాన్పించుట లేదు. ఈ పట్టణమున పేదవారెవ్వ నివసింప వలను పడదు. నావంటివా డెట్లుండగలడు! ఒక్కొక్క రోజునకే 10 రూ. కావలసియున్నది. హోటలులో గది అద్దెకు రోజుకు 5 రూ. కావలసియున్నది. భోజనమునకు, ఇతర ఖర్చులకు 5 రూ. కావలసియున్నది. నేను తెచ్చిన ధన మెంతయు నల్పముగా నున్నది!

ఈ విషయ మిట్లుండ ప్రపంచమహాసభ సెప్టెంబరు మొదటి వారములోగాని ప్రారంభము గాదని తెలిసినది. ఇప్పుడు జూలై గద! అంతవరకు యిచ్చట నుండుట దుర్భర మే!

అదిగాక ఈ సభకు వచ్చు వ్యక్తులు ఏదైనను సంఘము తరపున పంపించబడినవారుగా నుండవలయు నట. మదరాసు విద్యార్థుల కీ విషయములు తెలియవు. నేను తెలిసికొనుటకు ప్రయత్నించ లేదు.

ఏనను ముందుగా ఏ యూర ఖర్చు తక్కువగా నుండునో, అక్కడకు చేరి జీవయాత్ర గడుప వలయును.

ఈ విషయము లన్నియు గురుదేవుని కటాక్షముచే చక్కబేయబడవలయును గాని, నావల్ల గానేరవు.

(హోటలు కీపరు ప్రవేశించును.)

వివేకా—అయ్యా! ఇక్కడ ఖర్చు ఎక్కువ యగుచున్నవి. తక్కువ ఖర్చులలో జీవితము గడుపు పట్టణము తెలుప గలరా?

హోటలు కీపరు—స్వామిజీ! తమరు బోస్టను పట్టణములో నుండవచ్చును. అక్కడ ఇంత ఖర్చుండదు.

వివేకా—అక్కడ కూడా హోటళ్ళలోనికి నల్లవాళ్ళను రానీయరా?

హోటలు కీపరు—ఇక్కడ నల్లవాళ్లను నీగ్రోలని పిల్తురు. తెల్లదొరలతో కలసి కూర్చుండ నీయరు. కలసి ఫలాహారములు చేయనీయరు. చివరకు హోటళ్లలోనికి ప్రవేశము కూడ నీయరు. నీవు చదువుకొన్నవాడ వని నీ యిబ్బందులు చూచి నేను నీకు బస యిచ్చుటలో సాహసమే చేసితిని. మీ దేశములోగూడ మాలలను మీరు దగ్గఱకు రానీయ రట - వీధులలో నడువనీయ రట - పత్రికలలో చదువుచుందుము.

వివేకా—భారత దేశములో సంఘసంస్కారము జరుగుచున్నది. ఇప్పుడు సంఘములో నున్న పెద్దల దృష్టి ఆ వైపునకే మఱలియున్నది.

(ఒక దొరసాని ప్రవేశించును.)

హో.కీ—అమ్మా! మీ రెక్కడకు పోవుచున్నారు?

దొరసాని—బోస్టను వెళ్లుచున్నాను.

హో.కీ—ఏ పనిమీద?

దొరసాని—అక్కడ మా స్వంత యిల్లున్నది. వ్యవహారము లున్నవి. స్వంతపనుల నిమిత్తమై వచ్చితిని. వెళ్లుచుంటిని.
హో.కీ—వీరు కూడ బోస్టను వచ్చుచున్నారు.
దొరసాని—అట్లైన మావెంట వచ్చి, మాయింట నతిథులై యుండవచ్చును. (వి. చూచి) తమ రెవరు? ఏమి పనిపై వచ్చితిరి?
వివేకా—భారతదేశము నుండి ప్రపంచమతమహాసభకు వచ్చితిని. సభ యింకను రెండుమాసములకు గాని జరుగ దట. ఇక్కడ ఖర్చు లెక్కువ,బోస్టనుకు వచ్చుచున్నాను.
దొరసాని—(స్వ) ఈతని ముఖవర్చస్సు కోమలమై, లావణ్యమై, జ్ఞానోద్దీపకమై చక్కగా నున్నది. నిజమైన వైరాగ్యము స్ఫురించుచున్నది. మా యింటియందే యుంచుకొని మహత్తరవిషయములు వినుదును. భగవంతు డిచ్చిన ఈ అవకాశము జారవిడువను.
(ప్రకాశముగ) అయ్యా, నావెంట రండు. మా యింట బస చేయుడు. మీ మత విషయమును ముందుగా నాకు చెప్పుడు. అక్కడ గల గొప్పగొప్పవారికిని, విద్యావంతులకును మిమ్ముల నెఱుకపఱచెదను.
హో. కీ—అయ్యా! ఆ అమ్మగారిలో పొందు. మీకు సౌకర్యము లన్నియు కుదురును.
వివేకా—అట్లే వచ్చుచున్నా నమ్మా.

(దొరసాని, హోటల్ కీపరు నిష్క్రమింతురు.)

వివేకా—ఏ విధమున నెక్కడ సహాయము లభించని క్రొత్త

చోటగూడ గురుదేవుడు తన కార్యమును సాధించుకొను చునే యున్నాడు?

గీ. అమ్మ గురువరేణ్యులకు జ్ఞానమ్మొసంగె
అమ్మ ఆశీర్వదించి నన్నంపె నిటకు
అమ్మ యింటికి అతిథిగా నరుగుచుంటి
అమ్మ వెన్వెంట నుండ లోపమ్ము గలదె.?

(నిష్క్రమించును)

రంగము 18.

(బోస్టను పట్టణములో)

[వివేకానందస్వామి దగ్గరకు దొరసాని, J. H. Wright (Professor of Greek in the Harvard University) వారిని తీసికొనివచ్చును.]

వి—దయచేయండి.

రైటు—ఓహో! మీరేనా హిందూదేశమునుండి వచ్చినది!

వి—అవును, నేనే.

రైటు—మీ మతమునకు ప్రమాణగ్రంథము లేవి?

వి—వేదములు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత.

రైటు—మీ మతమునకు ప్రధానపురుషు డెవడు?

వి—హిందూమత మొక పురుషునిపై ఆధారపడియుండ లేదు. అనేకమంది మహర్షుల అనుభవము కలసి ఈ మత మయ్యెను.

రైటు—అందరు వేఱువేఱు విషయములను చూపించిరా?

వి—లేదు. అందరు ఒకే బ్రహ్మనుగూర్చి పలికిరి.

రైటు—పాపముల గూర్చి మీ మత మేమి చెప్పుచున్నది?

వి—పశ్చాత్తాపము నొందినచో వాటి బలము తగ్గు నని.

రైటు—యేసుక్రీస్తుగూర్చి నీ అభిప్రాయ మేమని?

వి—ఆయన ధీరుడు, జ్ఞాని. భగవంతుని ప్రేమతత్వమును వెద జల్లెను.

రైటు—చక్కగా నర్థము చేసికొనియున్నారు. తమరు తప్పక ప్రపంచమతమహాసభలో పాల్గొనవలసినదే!

వి—నే నే సంఘము తరఫున రాలేదే! న న్నెవరు పరిచయము చేయించగలరు?

రైటు—తమ విషయమై చెప్పుట సూర్యునికి వెలుగు నీయుగల శక్తి యున్నదా, లేదా యని ఆలోచించుట. నేనే వారి పేర వ్రాసెదను. మా విశ్వవిద్యాలయములలో నున్న ప్రొఫె సర్ల జ్ఞాన మంతయు తూచినను మీ జ్ఞానములో 1000 వంతు గానేరదు. మా అదృష్టమున లభించిరి. (దొరసానిని చూచి) మన యేసుక్రీస్తే ఈ రూపముగా ప్రేమతత్వ మును వెదజల్లుటకు వచ్చియుండనోపు.

స్వామిజీ! తమ కుత్తరముల నిచ్చెదను. వారి పేరకూడ వేరుగా వ్రాసెదను. తమరు చికాగో వెళ్ళుడు. ఇంక నాలుగురోజులలో సభ కూడగలదు. సరిగాని—మతముల గూర్చి మీ అభిప్రాయ మేమి?

వి—అన్ని మతములు ఆయనను చేరుటకు మార్గములే.

రైటు—బాగు! బాగు! మీ సమన్వయజ్ఞానము బాగున్నది.

తమరు తప్పక నచ్చుట మాట్లాడవలసిన వారే యగుదురు. మీరు మరల, చికాగో వెళ్లుటకు కొంత ధన మిచ్చెదను. టికెట్టు తీసికొనుడు.

వి—అట్లే - ఈ ప్రేమ మరువదగినది కాదు.

రైటు—నా విధి నే నొనర్చితిని. సెలవు.

(నిష్క్రమించును.)

## రంగము 19.

(చికాగోలో వివేకానందస్వామి రైలుస్టేషనులో)

ఈశ్వరవిలాస మేమి! ఎక్కడి కెక్కడ గురుకృపచేత ప్రసరించుచున్నయది. ప్రస్తుతము నా స్థితి ఎంత దీనమై యున్నది. రైటుదొరగారు నా కిచ్చిన సిఫారసు ఉత్తరములు ఎక్కడనో జారిపోయినవి. అరచేత అరగాని యైనను లేదు. కూటికి గూడ చూడవలసియున్నది. ఇక్కడనుండి సభావిషయములు చెప్పగలవా రున్నారేమొ తెలిసికొన వలసియున్నది. ఎవరి నడుగుదును! దగ్గర నున్న సామాను లన్నియు పోవుట, సన్యాసికి తగిన కార్యమే. (ట్రంకుపెట్టె చేతితో పుచ్చుకొని లేచి) అయ్యా! ప్రపంచమత మహాసభ యెప్పుడో, ఎచ్చటనో చెప్పగలరా?

దొరలు— { ఒకడు—మాకు తెలియదు పొమ్ము.
ఒకడు—(చూచి కికిలినవ్వు నవ్వును.)
ఒకడు—ఈ కొత్తమృగం ఎక్కడిదోయి!

వి—పదిగంటలైనది - ఎవడు జవాబు చెప్పువాడే లేడే!

ఆకలిగా నున్నది. భిక్షాటన మాచరించెదను. (ముందునడచి)

ఒకయింటిదగ్గర—భవతి భిక్షాం దేహి!

ఇంటివాళ్లు—పో.

ఒకయింటిదగ్గర—భవతి భిక్షాం దేహి!

ఇంటివాళ్లు—మొద్దువలె ఉన్నావు. కూలిచేసుకు తిను, పో.

ఒకయింటిదగ్గఱ—భవతి భిక్షాం దేహి !

ఇంటివాళ్లు—అయ్యా! మేము కడుపేదవారము.

వి—ఓహో! ఇక్కడ నెవ్వరును భిక్షము పెట్టువారును లేరే! పరమేశ్వరా! ఎట్టి స్థితికి తెచ్చితివి! చేత ధనము లేకుండ చేసితివి! ఆకలి కన్నము లభింపనీయవైతివి! రైటుదొరవారు వ్రాసి యిచ్చిన సిఫార్సు ఉత్తరములను పాఱవేయించితివి! ఆహాహా! గురువర్యా! నన్నేల అమెరికా దేశమునకు తీసికొనివచ్చితివి! తెచ్చి యీ అగచాట్ల నేల పెట్టెదవు! ఇంక నా ప్రయత్నము లేదు. ప్రభూ! నీవే శరణ్యము. గురువరేణ్యా! దాసోహం. అమ్మా! కాళికా మాతా! నీయిష్టము. శారదామాతా! నీ తపశ్శక్తియే నా కాధారముగాని మఱేమియు లేదు. నాకుగల తెల్వి తేటలన్నియు నీ దానంగినవియే కదమ్మా! పాల ముంచినను నీట ముంచినను నీదే భారము! (ఒక యింటి అరుగుపై చతికిలబడును.) (ఆ యింటిలోనుండి దొరసాని బైటకు వచ్చి స్వామివారిని చూచి)

హేలు—(స్వ) బోష్టనునుండి రైటుదొర వ్రాసిన వ్యక్తి ఈతడనియే తోచుచున్నది. గుర్తులన్నియు ఇతనియందు కాన్పించుచున్నవి. ఐనను పలుకరించి చూచెదను.

(ప్ర) ఆర్యా! తాము ప్రపంచమతమహాసభకు హిందూదేశమునుండి ప్రతినిధిగా వచ్చితిరా?

వి—(ఆశ్చర్యముతో) అవును (స్వ) ఎవరీ యమ్మగారు! నన్నెరిగెను.

హేలు—తాము లోపలకు దయచేసి తత్క్షణమే స్నానము చేయుడు. ఆహారము స్వీకరింపుడు. తగిన వస్త్రములు ధరించి విశ్రాంతి తీసికొనుడు. తరువాత తక్కిన విషయములు మాట్లాడుదును. మీ విషయమై రైటుదొరగారు నాకు దెలియజేసియున్నారు. మిమ్ములను నిప్పుడే సభకు తీసికొని పోవలసియున్నది. మీ కొఱకై చూచుచుంటిని.

వివే—ఓహో! ఏమి ఆ జగజ్జనని కరుణావిశేషము. (స్వ) ప్రియురాల్నాహంకార మున్నంతవరకు అమ్మ రక్షణకు రాదుగద!

గీ. అన్యథా శరణం నాస్తి యని యెవండు
హృదయకమలమ్ము నమ్మ కర్పించు భక్తి
ఆ యహంకారశూన్యున కా క్షణంబె
అమ్మ సేవింపరాదె దయార్ద్రదృష్టి.

(లోపల ప్రవేశించుదురు.)

## రంగము 20.

[చికాగోలో ప్రపంచమత మహా సభ: 1893 September అధ్యక్షుడు: డాక్టరు. బారోస్ దొరగారు. ఇతర సభ్యులు. Monday at 10 P. M. బ్రహ్మ సమాజము తరఫున ముజుంధారు. కలకత్తా, నాగర్కార్, బొంబాయి. జైన మతస్థుల తరఫున గాంధీ. దివ్యజ్ఞాన సమాజము తరఫున చక్రవర్తి అనిబీసెంటు. ఉపనిషన్మతము తరఫున వివేకానందస్వామి,

బౌద్ధమతము తరఫున-ధర్మపాలుడు - సిలోను. అందరు కుర్చీలలో కూర్చుని యుందురు. మహమ్మదీయ గురువులు, క్రైస్తవ గురువులును ఉందురు. సామాన్య ప్రార్థన.]

డాక్టరు బారోగ్స్—దొరసానులారా! పెద్దమనుష్యులారా!
అనేక దేశములనుండి కష్టనిష్ఠురముల కోర్చి, ఈ మహా సభను జయప్రదముగ సాగించుటకు వచ్చిన మీ అందరను అభినందించుచున్నాను. మీ రందరును సక్రమముగ ఆయా సమాజముల తరఫుననే వచ్చియున్నారు. ఈ స్వామి - వివేకానందస్వామి మాత్రము హిందూదేశము నుండియే వచ్చినను, హార్వర్డు యూనివర్సిటీ ప్రొఫెసరు రైటు దొర వారిచే సిఫార్సు చేయబడి, సభలో ప్రవేశమును పొందిరి. వీ రే సంఘము తరఫున వచ్చియుండ లేదు. తమ రందరకును అమెరికా ఖండవాసుల తరఫున మరియొకసారి వందనముల నర్పించుచున్నాను. ఒక భగవచ్ఛక్తి కలదని ప్రతివారును నమ్మి యే శక్తికి సేవచేయుటకు సిద్ధమగుచున్నారో, యే శక్తి, ప్రతివానికి మానసిక ఆధ్యాత్మిక శక్తులను ప్రసాదించుచున్నదో, ఏ శక్తి యను పునాది మీదనే హిందువుల విజ్ఞానపరంపరలు ఆధారపడి పాశ్చాత్యుల నాగరికతను తీసికొనుచున్నవో, అట్టి శక్తిని గూర్చి ప్రతి మతమువారును తెలిసికొనవలసిన యవసరమేర్పడినది గావున మతమునకు ముఖ్యముగ ప్రాధాన్యమీయవలయును. నేనే యెక్కువగ మాట్లాడి మీ కాలమును వ్యర్థము చేయను. చక్రవర్తిగారు మాట్లాడుదురు.

చక్రవర్తి (లేచి)— Ladies and Gentlemen! దివ్యజ్ఞాన సమాజమున నన్నిమతముల వారికి చోటున్నది. అందరును చేరవచ్చును. మహర్షులు మనలను పాలించుచున్నారు. వారి కృపకు మనము పాత్రులము గావలసియున్నాము. ఈ విషయమునందు ప్రజలు ముఖ్యముగ శ్రద్ధతీసికొనవలసి యున్నది. (కరతాళధ్వనులు)

డా. బారోస్— బౌద్ధమతమునుగూర్చి ధర్మపాలుగారు పల్కుదురు.

ధర్మపాలు—(లేచి) Ladies and Gentlemen! అహింసయే ముక్తిమార్గము. ఒకరు మనయం దెట్లుండవలయునని కోరుకొందుమో, అట్లే మన మితరులయం దుండవలయును గదా! కావున నెవనికి హానిచేయరాదు. అట్లున్నవారికే నిర్వాణము చేకూరును. (కరతాళధ్వనులు)

డా. బారోస్—(లేచి) వివేకానంద స్వామివారు మాట్లాడుదురు.

వివేకానందస్వామి (లేచి స్వ) —

గీ. అమ్మ! యో బ్రహ్మరాణి నిన్నమ్మినాడ
నాట్య మొనరింపవమ్మ నా నాల్కపైన
గురువరా! తండ్రి! నా బుద్ధి గుహను జొచ్చి
తగిన యూహాలు తోచింప దరలిరమ్మ.

(ప్ర)—సోదరసోదరీమణులారా! Sisters and Brothers of America (కరతాళధ్వనులు) ప్రపంచమతమహాసభకు ఆహ్వా

నిలిచినమిమ్ములనందరను హృదయపూర్వకముగ నభినందించు చున్నాను. ఏ మత మన్నిమతములకు తల్లివంటిదో, ఏ మతమునందు వేదాంత మెరిగిన సన్యాసులు మహర్షులు ఉద్భవించిరో, ఏమతము సర్వమతసామరస్యమునకు తోడ్ప డునో అదియే నా వేదమతము. (కరతాళధ్వనులు) అనేక ప్రవాహములు ఎక్కడెక్కడ పుట్టినను ఎక్కడెక్కడ ప్రవహించినను, తుదకు సముద్రమునే ఎట్లు చేరుచున్నవో, అట్లే ఏయే మతములో యేయే దేశములో ఎవడు పుట్టినను ఏయేమార్గమునందు నడచినను, తుదకు ఒకే భగవంతుని చేరుచున్నాడని వేదమతము చెప్పుచున్నది. ఉపనిషత్తులు భగవద్గీతయు నిట్లే చెప్పుచున్నవి. అట్టి మతమునందు ద్వేషమునకు చోటు లేకుండుటయేగాక అన్నిమతముల వారిని, సోదరసోదరీమణులని భావించుటలో తప్పేమున్నది? కావున వారి వారి మతములయందే చక్కగ ననుష్ఠించి, భగవంతుని కనుగొనవచ్చునని వేదమాత చెప్పుచున్నది. "నాది" "నేను" యీ రెండును లయమైన వెంటనే మిగులు నది పరబ్రహ్మయే, కావున మీరందరు బ్రహ్మస్వరూపులే యని వేద ముద్ఘోషించుచున్నది. (కరతాళధ్వనులు)

గీ. ఎచటఁ బుట్టుగాక! ఎచ్చటఁ బ్రవహించు
గాక! జలధియందె కలియు నదులు;
ఎచటఁ బుట్టుగాక! ఎట వసించెదు గాక!
జీవులెల్ల కలియు దేవునందె!

గీ. మతమటన్న నేమి? మార్గమ్మె యవుగాదె?
మతము లేక దేవు వెతకుటెట్లు?
యూరు చేరు టన్న దారు లెన్నుండవో?
దారిలేక యూరు చేరుటెట్లు?

గీ. మతము మార్చుకొన్న మహిమలు కలుగునా?
మనసు మారెనేని మహిమ గలదు
మనసు లయమె యైన మనుజుండు దైవమా;
వేదసార మిద్ది వినుడు బుధులు!

గీ. వేదమాత మాట వేయేండ్లు వర్ధిల్లు
మనిషి మాట లపుడె మాయమగును
మనుజు నమ్మనేల? మాధవు నమ్మరా
రాజబాట దొరకురా! నిజంబు.

గీ. ఎవని యందున్న ఆత్మగానీ యొకండె
గుణములందె భేదమ్ములు; గుణికి లేవు.
గాన నైకమత్యంబె మోక్షప్రదంబు
వేదసారమ్ము తెలియుడీ విబుధులార!

గీ. ప్రేమమయమూర్తి గాదె హిందూమతంబు
ద్వేషరహితంబు గాదె హిందూమతంబు
అన్ని మతముల సత్యంబు లనుభవములు
ప్రేమను గ్రహించు కన్నతల్లియె నిజంబు.

గీ. అట్టి వేదమతము నెట్లు గ్రహింతురా
గురువుసేవ లేక దొరకుటెట్లు

గ్రంథములు పఠింప జ్ఞానంబు దొరకునా
బ్రహ్మనిష్ఠవలనఁ బరగుగాక !

## AFTER PRAYERS TO SARASWATI

### Sisters and Brothers of America

As the different streams having their sources in different places all mingle their water in the sea, so, O, Lord, the different paths which men take, through different tendencies, various though they may appear, crooked or straight, all lead to thee.

Bhagavadgeeta says :—

" Whosoever comes to me through whatsoever form I reach him ; all men are struggling through paths which in the end lead to me ".

ఈ విషయము తెలిసికొనుటకే గురుసేవ కావలసి యున్నది. అట్టి గురువున కెట్టి లక్షణము లుండవలయునో బైబిలు కూడ చక్కగా చెప్పుచున్నది. అట్టి గురులక్షణములు కలవారినేనా మీరు సేవించుచున్నది ? గ్రుడ్డి గురువులను నమ్మిన గ్రుడ్డివా రగుదురు గద ? (కరతాళధ్వనులు)

(సభలో విపరీతమగు కరతాళధ్వనులు, జేబురుమాలు లెగుర వేయుట, సంతోష సూచనలు)

డా. బారోస్ — స్వామీజీ ! మీ సమయ మయిపోయినది.

(స్వామీజీ కూర్చుండబోవుచుండ ప్రేక్షకులు "Continue, Continue" యని మీరే చెప్పండి, మీరే చెప్పండి యని అరతురు.)

డా. బారోస్ — స్వామీజీ ! తమరే చెప్పండి.

వివేకా—ఒక మతమునందే మోక్ష మున్న దని చెప్పువారు నూతిలోని కప్పలవంటివారు గద ! ఒక మతమునందే దేవు డున్నాడని చెప్పువాని కంటె మూర్ఖు డుండునా ? మోక్షము మనసునం దున్నదిగాని మతమునం దేమున్నది. మీరు హిందూదేశములో హిందువులను క్రైస్తవులుగ చేయుచున్నారు. అంటే పేరులు మారుస్తున్నా రంతే. అది ముక్తికి మార్గముగాదు. మీలో నెందరు ఉపనిష త్తులు, బ్రహ్మసూత్రములు, భగవద్గీత చదివి అర్థము చేసికొనిరో చేతులెత్తుడు ? (కరతాళధ్వనులు) (8000 మందిలో 4 గురు చేతులెత్తుదురు). మీలో హిందూమత మును గూర్చి చదివినది నలుగురే అయినను, హిందూ మతమును ఖండించుటకు అందరుబయలుదేరుదురే! (తలలు వంచుకొందురు) ఇది సిగ్గుకాదా మీకు ! అవమానము గాదా మీకు ! - కావున అన్నిమతములు చదివి అర్థము చేసుకొన్నవా డింకొకమతము ఖండించునా ? అందలి అమృతమునే స్వీకరించును. (కరతాళధ్వనులు)

డా. బారోస్—Ladies & Gentlemen & Delegates! దొరసానులారా ! పెద్దమనుష్యులారా !! అతిథులారా !!! స్వాములవారి యుపన్యాసము వైపునకే మీ అందరి దృష్టులు కేంద్రీకరింపబడినవి. మీరే గాదు, సత్యమెరుంగ దలచిన ప్రతివానికి అది వినుట కుతూహలముగనే యుం డును. అమెరికా ప్రజలలో స్వామివారి పేరు హత్తుకొని పోయినది. ఈ మతమహాసభ తరఫున వారికి కృతజ్ఞతా

పూర్వక వందనము లర్పించుచున్నాను. వారిని ఉపన్యాసముల నిమిత్తమై కొన్ని మాసములు అమెరికాలోనే యుండవలయు నని, మీ అందరి తరఫున ప్రార్థించుచున్నాను. ప్రోగ్రాము ముందు తెలియచేయబడును. ఈ నాటిసభ పూర్తి అయినది. (తెర పడును)

## రంగము 21.

[రాజమండ్రి రైల్ వేస్టేషను ప్లాటుఫారములో]

న్యాపతి సుబ్బారావుపంతులుగారు:—

మిత్రులారా! రైలు వచ్చు వేళయైనది. ఈ రైలులోనే శ్రీ శ్రీ వివేకానందస్వామివారు వచ్చుచున్నారు. వారు కలకత్తా వెళ్లుదురు. మన భాగ్యమే కదా - వారికొరకు పూలదండ సమర్పించు కొందము.

(అంతలో రైలు దిగి స్వామివారు నిలుతురు)

(శ్రీ పంతులుగారు వారిమెడలో పూలదండ నుంతురు.)

( కరతాళధ్వనులు )

ఒక కవి కుమారుడు—

గీ. దేశమాత దేదీప్యపుం దేజమదిగొ!
జ్ఞానభానుండు నవ్వుచున్నాడు చూడు
దాస్యతిమిరమ్ము నకు నింక తావులేదు
భళిర! ధన్యాత్ములము శివదర్శనమున!

(స్వామివారు, అందరికి నమస్కరించు)

వివే— నా భారత దేశము నాభారతమాత సేవాభాగ్యము లభించు. నా వేదభూమి నా వేదమాత సేవాభాగ్యములభించు.

నా కర్మభూమి } అహో ! నా ఋషిసంతానము !!!
నా పుణ్యభూమి } నా భారతభూమికై రక్తము ధారపోయు దును. అజ్ఞానమును కూకటి వేళ్ళతో పెకలించెదనుగాక. నా భారతదేశము పూర్వపు టౌన్నత్యదశలో నుండగాంతును గాక ! పాశ్చాత్యదేశములలో నాల్గు సంవత్సరములుగ ఆధ్యాత్మిక ప్రబోధము గావించినను నా మనస్సు భారత మాత పాదపద్మములయందే గలదు. నా కార్యక్రమ ములో మీ రందరు పాల్గొన గోరుచున్నాను. మీరందరు గౌరవించుట ఈ పేదసన్యాసినిగాదు. ఆ వేదమాతనే గౌర వించుచున్నారు. భగవద్గీతను చదువుడు. ధైర్యశాలురు కండు. ఇంతకును కారణమెవ్వరో తెలియునా ?

గీ. నాతిగల బ్రహ్మచర్యంబు నడిపె నెవడు?
కామినీకాంచనము దోసియ గలిగె నెవడు?
వేదమాతగా మూర్తిభవించె నెవడు?
సకలమతముల సారమ్ము జాటె నెవడు?
అనుభవంబున కెవడు పెట్టినది పేరు?
ఆర్యహితుడు ప్రేమాస్పదుం డఘరహితుడు;
అతడె శ్రీరామకృష్ణుఁ డీ యవనిలోన
మఱతుమే వారి నెన్నిజన్మాలకైన.

( కరతాళధ్వనులు )

(ప్లాటుఫారము మీద)

జై శ్రీరామకృష్ణపరమహంసగారికి
జై వివేకానందస్వామిగారికి — జై భరతమాతకు !

## రంగము 22.

### కలకత్తావీధిలో ఒక హరిజనసోదరుడు

(స్వ) ఔరా! ఎన్ని యిక్కట్లు పడవలసెను? మా దొర పెద్ద బంగాళాలో కాపురము. నేను మురికిగుంటల మధ్య నివసించుట. సుఖమైన స్థలమిచ్చుటకైనను వారికి దయరాక పోయెనే? మా కష్టవానిని చవివించుటకైనను, సొమ్ము లేదు గద - పెద్దకులమనుకొను వారి బడులలోనికి రానీయరు గద - అంతవఱకేల? శుభ్రములైన నడివీధులలో కూడ నడువనిచ్చుటలేదు. పెద్దవారనుకొనువారనుభవించు సుఖములకు మా మేని చెమటలే కదా కారణము. ఇంక నీకట్టుబాట్లలో నెన్నినాళ్ళు జీవించగలను?

(క్రైస్తవ సోదరుడు ప్రవేశించును.)

ఏమోయి! నే నెన్నిసార్లు చెప్పినను వినవుగద! మా మతములో కలవవోయి. నీకు అన్ని విధముల సౌకర్యములు కలిగించెదము. నీపిల్లవానికి చదువు చెప్పించెదము. నీకు వసతిగల కుటీర మిప్పించెదము. ఇంతయేల - మాదొరగారి దగ్గఱ వారితో సమానంగా కారులో కూర్చొపెట్టస్తాము. ఇంక యేసుక్రీస్తు ప్రభువు నీకు పరలోకరాజ్యంలో సుఖం ఇస్తాడు. ఆయన మనపాపములకై పుట్టినాడు.

హరిజనసోదరుడు—ఇది బాగానే ఉందండి. అయితే యేసుక్రీస్తు ప్రభువు చెప్పినట్లు నడుచుకోవటం కష్టం అంటారు గాదండి.

క్రై. సో. —నిజమేనోయి! అలా నీవు నడుస్తావా? నేను నడుస్తున్నానా! - మన గురువులు నడుస్తారా? - ఎవడో

ఒకానొకడు నడుస్తాడు గాని. ఈ మాటల కేమిగాని, ఆయ
నను నమ్ముకోవోయి, యిందులో చేరి! మీ మతంలో
నువ్వెన్ని బాధలు పడుచున్నావో చూడు!

(మహమ్మదీయ సోదరుడు ప్రవేశము.)

ఏమండీ పాదిరీగారు! వీణ్ణి మీలో కలుపుకుందాం అనుకొంటున్నారా! మీలో మీకే అనేక తగాదాలున్నాయి. కాథలిక్కులని, ప్రొటెస్టెంటు లని, ఇంకా ఎన్నో! ఎందులో కలుపుతారు వీణ్ణి.

హ. సో. —వారిలో వారికి కూడ స్నేహం లేదటండీ.

మ. సో. —తెల్లవాళ్ళు, నల్లవాళ్ళు అనే భేదమే వాళ్ళలో చావలేదు. క్రీస్తు ప్రభువు పేరు చెప్పుకొని పొట్టపోసుకుంటున్నారు. మీ మతంకంటె బాగుంటుందిలే - కాని మా మతంలోకిరా! కులభేదాలు లేవు. కక్షలు లేవు. మాతో సమానంగా ఉండవచ్చు. వెయ్యి దేవుళ్ళు లేరు. ఒకే దేవుడు. అందరము ఆయన బిడ్డలము.

హ. సో. —నా కష్టాలకు అడ్డువస్తారా అండి.

మ. సో. —ముందు భక్తితో చేరవోయి. తరువాత చూద్దాం తక్కిన సంగతులు.

(వివేకానంద స్వామి ప్రవేశించును.)

సోదరులారా! ఏవిషయమై ప్రసంగించుచున్నారు?

హ. సో. —(నమస్కరించి) ఆర్యా! హిందూ మతములో కష్టము లెక్కువగా నున్నవి. ఆదుకొనువారు కాన్పించుట లేదు. ఏమతంలో నైనా చేరితే బాగుంటుం దేమో అను

కొంటుండగా వీరు వచ్చి వారి వారి మతములలో చేరు మంటున్నారు.

వివేకానందస్వామి—సోదరులారా! ఎందుకీ ఆడంబరములు. ఎందుల కీ స్వార్థపరాయణత్వము. మతము మార్చుటవలన నేమి ప్రయోజనము? పేరు మార్చుటయే గదా! మనస్సు మారవలయు నని గదా మతము లన్నియు చెప్పుట. అన్ని మతముల వారికి దేవు డొక్కడే గద! అన్ని మతముల వారికి సత్ప్రవర్తనము ముఖ్యము గద! అన్ని మతముల లోను ప్రక్క యింటివానిని తన వలె చూచుకొమ్మనియే గదా సిద్ధాంతము ! అన్నిమతముల వారికి పాపనాశనము పశ్చాత్తాపము వలన, అనుభవము వలన, కావలసిన దే గద! ప్రాపంచిక లాభములకై మతము మార్చుకొన వలయును గాని, ముక్తికై మార్చుకొనవలసిన పని లేదు. ఖొరానులో చూడుడు. "మతము మార్చవలయు నను నిర్బంధము లేదు" అని గలదు. బైబిలులో చూడుడు. "నేను నా తండ్రియు నొకటియే. నన్ను చూచినవాడు నా తండ్రిని చూచినట్లే" అని యున్నది. భగవద్గీతలో చూడుడు. "ఎవ రే విధమున నన్నారాధించినను నరే" యని యున్నది. ఉపనిషత్తులలో చూడుడు. "శివుడే శుద్ధు డైనచో దేవు" డని యున్నది.

కావున - సోదరులారా! నిజముగా మీకు సహాయము చేయవలయు నని యున్నచో మతములో కలుపుకోవల యునా? అవసరమగు ధనసహాయము చేయుడు. విద్యాసహా యము చేయుడు.

నాయనా ! హరిజనసోదరా ! నీవు మతము మార్చుకొనవలసిన పనిలేదు. హిందూమతమునందే ఉదారులుకూడ ననేకమంది గలరు. వారిచే నీకు కావలసిన సహాయము చేయించెదను. రమ్ము. నీ భక్తివిశ్వాసములు మార్చుకొనవలసిన పనిలేదు. నీ కష్టములకై యితరులను దూషించను వద్దు. హరిజనసోదరులకు మంచికాలము రానున్నది; భయపడకుము.

గీ. మతము మార్చుకొనుట మతిమార్చుకొను కాదె?
పేరు మారు గాక మిత్రులార !
మతములందు దోషమతు లున్న మాత్రాన
మతము మార్చ నగునె? మాన్యులార !

సోదరా ! రమ్ము ! మంగళ మిట్లుండుగాక !

గీ. కులమువలనగాని గోత్రమ్మునను గాని
ధనమువలన గాని ఘనత గాని
జాతివలనగాని సంఘమ్ముచేగాని
దురిత మేమి లేదు సరసులార !

గీ. బిరుదువల్లగాని ప్రియులవల్లనుగాని
దేశముననుగాని వాసిఁగాని
రంగువలనగాని, రాజ్యమ్మునను గాని,
దురిత మేమి లేదు సరసులార !

గీ. అన్నికష్టమ్ముల పునాది స్వార్థపరత
అన్నికష్టమ్ములకు నిక్క స్వార్థపరత
స్వార్థపరతయే పోయెనా అప్పుడప్పుడె
అచట ఆనందసామ్రాజ్య మబ్బుకున్నె !

# కళాపీఠ ప్రచురణాలు.

---

1. The History of Andhra Commerce Rs. 0—2—0
   by, Sree K. R. Subrahmanyam M. A, Ph. D.,

2. Andhra Social Life & Organisation 0—8—0
   by, Sree B. Seshagiri Rao, M. A. Ph. D., M. A S.,

3. శ్రీ కళ్యాణ హాస సుమము (సంస్కృతము) 0—2—0
   శ్రీ విద్వాన్ కోపల్లె శివకామేశ్వరరావు

4. నారాయణరావు (నవల) శ్రీ అడివి బాపిరాజు, 2—8—0

5. రేఖావళి: (అందమైన రేఖాచిత్రాలు: ఆనందకరమైన గేయాలు) శ్రీ తాండవకృష్ణ సంకలితము. 0—4—0

6. "నూటపదహార్లు" - బాలబాలికలకు కంఠపాఠము చేయదగిన తెలుగు పద్యరత్నములు. శ్రీ రాజా రంగయ్యప్పారావు బహద్దరు, ఎం. ఏ., (ఉయ్యూరు యువరాజావారు) శ్రీ మాధవాచార్యులు, ఎం.ఏ., గార్లచే సంపాదింపబడినవి. 0—4—0

7. రాణీ సోమ. రాజ రాధాకృష్ణశాస్త్రి 0—8—0

8. అమరకోశము - అమరసింహుడు 3—0—0

—। ముద్రణలో నున్న గ్రంథాలు ।—

9. **Andhra Industry**
Sree R. K. N. Gajapati Raju, B. A., B. L.,

10. **Andhras & their contribution to the Dance-Art**
Sree Thandava Krishna, M. A.

11. **The Kuchipudi Dancers of Andhra**
Sree Thandava Krishna, M. A.
(Paper contributed to the All India Oriental Conference - Hyderabad)

12. భారతీయ నాట్యము - శ్రీ తాండవకృష్ణ, ఎం. ఎ.

13. కూచిపూడి భాగవతులు - శ్రీ తాండవకృష్ణ, ఎం. ఎ.

14. నాట్యసుందరులు - శ్రీ తాండవకృష్ణ, ఎం. ఎ.

15. కళాశిఖరాలు
కథా వాఙ్మయంలో సుస్థిరకీర్తి నార్జించిన కథకుల రచనలు

16. కౌముదీ మహోత్సవము (నాటకము)
దివాకర్ల వెంకటావధాని B.A. (Hons)

17. ప్రపంచయుద్ధం - రాజ రాధాకృష్ణశాస్త్రి